ఆదివారం
07-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 196
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్‌పై 60కిపైగా రాకెట్లతో హెజ్బుల్లా దాడి

బీరుట్: ఇజ్రాయిల్‌పై హెజ్బుల్లా ప్రతీకారం దాడులు చేసింది. 62 రాకెట్లతో 'మౌంట్ మెరోన్'పై ఉన్న గగనతల నిఘా స్థావరంపై దాడి చేసింది. బీరుట్ సమీప ప్రాంతంలో సీనియర్ హమాస్ నేతను హతమార్చిన ఘటనపై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రకటించిన మరుసటి రోజే ఇజ్రాయిల్‌పై విరుచుకుపడింది. ఇజ్రాయిల్ దాడిలో హమాస్ కీలక నేత సలేహ్ అరౌరి చనిపోయాడు. హెజ్బుల్లా దాడులను ఇజ్రాయిల్ సైన్యం ధ్రువీకరించింది. రాకెట్లు ప్రయోగించిన ఉగ్రవాదులపై ఎదురుదాడి చేసినట్లు తెలిపింది. ఉత్తర ఇజ్రాయిల్‌పై దాడులు చేసినట్లు శనివారం ఓ ప్రకటనను హెజ్బుల్లా విడుదల చేసింది. మెరోన్ ఎయిర్ కంట్రోల్ బేస్ లక్ష్యంగా 62 రకాల మిసైళ్లతో దాడి చేశామని తెలిపింది.

అంగన్‌వాడీలపై ఎస్మా

- అత్యవసర సర్వీసుల కింద జీవో 2 జారీ
- సమ్మెలు 6 నెలలు నిషేధిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు
- జీతాల్లో కోత విధిస్తూ అకౌంట్లలో జమ
- అరాచక పాలనకు పరాకాష్ఠ అంటూ విపక్షాల మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అంగన్‌వాడీల ఉద్యమంపై జగన్ సర్కారు ఉక్కుపాదం మోపింది. 26 రోజులుగా ఆందోళన చేస్తున్నా ఏమాత్రం పరిష్కారానికి ముందుకు రాని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రమాదకరమైన ఎస్మాను ప్రయోగించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 26 రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలపై ఏమాత్రం శ్రద్ధ చూపని రాష్ట్ర ప్రభుత్వం...ఉద్యమం అణచివేత కోసం కఠిన చర్యలకు ఉపక్రమించింది. అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంగన్‌వాడీలను అత్యవసర సర్వీసుల కిందకి తీసుకొస్తూ జీవో నెంబర్ 2

విడుదల చేసింది. దీని ప్రకారం ఆరు నెలలపాటు సమ్మెలు, నిరసనలు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేసింది. అత్యవసర సేవలు అందించే ఉద్యోగులు తమ విధులకు హాజరు కాకుండా ఆయా సేవలకు విఘాతం కలిగేలా సమ్మెలోకి దిగితే... జనజీవనానికి ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రభుత్వానికి ఈ

- మిగతా 2 లో



ఆదిత్య-ఎల్1 అద్భుత విజయం

- నిర్దిష్ట కక్ష్యలోకి పంపిన ఇస్రో
- శాస్త్రవేత్తలకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు

బెంగళూరు: సూర్యుడిని అధ్యయనం చేసేందుకు నింగిలోకి దూసుకెళ్లిన ఆదిత్య-ఎల్1 తన గమ్యస్థానాన్ని విజయవంతంగా చేరుకుంది. ఈ స్పేస్‌క్రాఫ్ట్‌ను తుది కక్ష్యలోకి ప్రవేశ పెట్టేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ శనివారం చేపట్టిన కీలక చర్య ఫలించింది. భూమి నుంచి సూర్యుని దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లగ్రాంజ్ పాయింట్ చుట్టూ ఉన్న హాలో కక్ష్యలోకి దీన్ని పంపించారు. ఇక్కడి నుంచి ఇది నిరంతరం సూర్యుడిని పర్యవేక్షిస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. గతేడాది సెప్టెంబరు 2న నింగిలోకి పంపిన ఆదిత్య-ఎల్1ను ఇస్రో శనివారం సాయంత్రం తుది కక్ష్యలోకి ప్రవేశపెట్టనుంది. రాకెట్‌ను నింగిలోకి పంపిన తర్వాత నాలుగు విన్యాసాలు,

- మిగతా 2 లో

వైసీపీ, టీడీపీలో గందరగోళం

- రాజీనామా చేస్తానని ప్రకటించిన ఎంపీ కేశినేని
- కేశినేనితో ఎంపీ కనకమేడల భేటీ
- వైసీపీకి అంబటి రాయుడు గుడ్ బై
- మూడో జాబితాపై అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ, టీడీపీలో గందరగోళం నెలకొంది. ఎవరు ఎప్పుడు పార్టీ నుంచి వీడతారో, ఇక వచ్చిన వారు ఉంటారో? లేదో తెలియక అధినాయకత్వాలు ఆందోళన చెందుతున్నాయి. తాజాగా క్రికెటర్ అంబటి రాయుడు అధికార పార్టీ వైసీపీకి రాజీనామా సీఎం జగన్‌కు షాక్ ఇచ్చారు. ఇటీవలే ఆయన వైసీపీలో చేరారు. అయితే చేరిన కొద్దిరోజుల్లోనే పార్టీకి రాజీనామా చేసి వెళ్లిపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అంబటి రాయుడు గుంటూరు ఎంపీ సీటును ఆశించగా, అందుకు అధిష్ఠానం అంగీకరించలేదని సమాచారం. మచిలీపట్నం ఎంపీగా పోటీ చేయాలని సీఎం సూచించగా, దానికి అయిష్టత చూపిన అంబటి రాజీనామా చేసినట్లు తెలిసింది. కొంతకాలం నుంచి అంబటి రాయుడు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాపరమైన సంక్షేమ పథకాలు, నాడు-నేడు పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలిస్తూ, వాటిపై ప్రచారం చేస్తున్నారు. అలాగే, ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమానికి కూడా ఆయన అంబాసిడర్‌గా ఉన్నారు. గుంటూరు ఎంపీగా అంబటి రాయుడుకు సర్వేలో వ్యతిరేకంగా వచ్చినట్లు తెలిసింది. దీంతో నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను గుంటూరు ఎంపీగా వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. అంబటి రాయుడును మచిలీపట్నం పంపేలా అధిష్ఠానం ఆలోచించింది. దీనిని గుర్తించిన అంబటి రాయుడు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కొంత కాలం పాటు రాజకీయాలకు దూరంగా ఉండనున్నట్లు ట్వీట్ చేశారు. దీనిపై ప్రభుత్వ సలహాదారు సజ్జల మాట్లాడుతూ అంబటి రాయుడు ఎందుకు రాజీనామా చేశారో తమకు తెలియదని అన్నారు.

కేశినేని రాజీనామా ప్రకటనతో టీడీపీకి షాక్

విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) నిర్ణయం పార్టీ అధినేత చంద్రబాబుకు, టీడీపీకి గట్టి షాక్ ఇచ్చింది. త్వరలో తాను ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మళ్లీ ట్వీట్ చేయడంతో ఆ పార్టీ శ్రేణులు గందరగోళానికి గురయ్యారు. విజయవాడ ఎంపీ సీటు వ్యవహారంపై కేశినేని నానికి, ఆయన సోదరుడు కేశినేని చిన్ని మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం విదితమే. వాటిని గుర్తించిన టీడీపీ అధిష్ఠానం తిరువూరులో జరిగే సభకు కేశినేని నానిని దూరంగా ఉంచింది. అప్పటి నుంచి ఆయన కలత చెందుతూ అధిష్ఠానంపై ట్వీట్లు పెడుతున్నారు. ఒక వైపు చంద్రబాబు నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు ఆయన ప్రకటిస్తూనే, మరో వైపు ఆయన అసంతృప్తిని వెల్లడిస్తున్నారు. తన అనుచరులతో భేటీలు నిర్వహించి ప్రత్యామ్నాయంపై చర్చిస్తున్నారు. దీంతో ఆయన ఇతర పార్టీలకు వెళ్లేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలిసింది. పైకి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తానని కేశినేని చెప్పినా, ఇతర పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో కేశినేని ఎంపీ కార్యాలయానికి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవికుమార్ వెళ్లారు. దాదాపు గంటకుపైగా కేశినేని నానితో ఆయన రహస్యంగా చర్చించారు. పార్టీకి, ఎంపీ పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో అధిష్ఠానం తరపున కనకమేడల దూతగా వచ్చినట్లు తెలిసింది. ఈ భేటీలోని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. మొత్తం మీద విజయవాడ, గుంటూరు నగరాల్లోని రాజకీయ పరిస్థితులు అధికార వైసీపీకి, ప్రతిపక్ష టీడీపీకి పెద్ద తలనొప్పిగా మారాయి.

మూడో జాబితాపై సీఎం కసరత్తు

వైసీపీ మూడో జాబితాపై ఆ పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్ కసరత్తు చేస్తున్నారు. ఈ జాబితాలో 10 నుంచి 15 మందిని మార్చే అవకాశం ఉంది. ఇది దాదాపు పూర్తయినట్లు తెలిసింది. ఈ జాబితాలో ఎమ్మెల్యేలతో పాటు

- మిగతా 2 లో

255 సీట్లలో కాంగ్రెస్ పోటీ?

నాయకులను ఒప్పిస్తున్న అధిష్ఠానం

న్యూఢిల్లీ: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో 255 స్థానాల్లో పోటీ చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. అయితే ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పక్షాలు అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌లో సీట్లు పంచుకోవడం కష్టం అన్న అభిప్రాయం సర్వత్రా ఉంది. కాంగ్రెస్ కూడా ఈ వాస్తవం అంగీకరిస్తోంది. 2019 లోకసభ ఎన్నికలలో కాంగ్రెస్ 421 స్థానాలలో పోటీ చేసింది. కానీ సాధించింది 52 మాత్రమే. ఇటీవల రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ అధికారం నిలబెట్టుకోలేకపోయింది. మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలలోనూ పరాజయమే ఎదురైంది. ఈ మూడు రాష్ట్రాలలోనూ కాంగ్రెస్‌కు ఇదివరకు వచ్చిన ఓట్ల శాతంలో మార్పు లేదు. పైగా ఇటీవలి మూడు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో గెలిచిన బీజేపీకన్నా కాంగ్రెస్‌కు పది లక్షల ఓట్లు ఎక్కువే వచ్చాయి. ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పక్షాలతో త్వరలో సీట్ల పంపిణీ గురించి చర్చలు మొదలవుతాయని కాంగ్రెస్ ప్రకటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అయిదుగురు సభ్యులు గల జాతీయ ఐక్య సంఘటన కమిటీతో సమావేశమయ్యారు. ఈ కమిటీ ఇటీవలే కాంగ్రెస్ నాయకత్వానికి నివేదిక అందజేసింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్ పరిశీలకులు, కాంగ్రెస్ శాసనసభా పక్షాల నాయకులతో సమావేశమైనప్పుడు 255 సీట్లలో కాంగ్రెస్ పోటీ చేసే అవకాశం ఉందని ఖడ్గే సూచన ప్రాయంగా తెలియజేశారు. మోదీ నాయకత్వంలోని బీజేపీని గద్దె దించడానికి తక్కువ సీట్లలో పోటీతో సరిపెట్టుకోవడానికి రాష్ట్రాల కాంగ్రెస్ నాయకులు సుముఖంగానే ఉన్నట్టు కనిపిస్తోంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయడానికి అక్కడ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అనుకూలంగానే ఉంది. అయితే ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు ఆత్మహత్యా సదృశం అవుతుందని పంజాబ్ కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారు. బెంగాల్ కాంగ్రెస్ విభాగం కూడా తృణమూల్‌తో సీట్ల సర్దుబాటుకు సుముఖంగా లేదు. కాంగ్రెస్‌కు రెండు సీట్లు మాత్రమే కేటాయించాలన్న తృణమూల్ ప్రతిపాదనపై లోకసభలో కాంగ్రెస్ పక్ష నాయకుడు అధీర్ రంజన్ మండిపడ్డున్నారు. తృణమూల్ దయాదాక్షిణ్యాలు తమకు అవసరం లేదంటున్నారు. కాంగ్రెస్ సహకరిస్తే సీట్ల సర్దుబాటుకు సిద్ధమేనని తృణమూల్ నాయకులు భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో సమాజ్ వాదీ పార్టీ 65 స్థానాల్లో పోటీ చేయాలనుకుంటోంది. అంటే కాంగ్రెస్, ఆర్ఎల్‌డీకి కలిపి 15 సీట్లు మాత్రమే కేటాయించడానికి సిద్ధంగా ఉంది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో సీట్ల సర్దుబాటు కోసం ఇండియా ఐక్య సంఘటన భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇండియా కూటమి మెజారిటీ సీట్లు గెలుచుకునే రీతిలోనే సర్దుబాట్లు జరగాలని కాంగ్రెస్ నాయకుడు ముకుల్ వాస్నిక్ అంటున్నారు. కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం నాయకత్వంలోని కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక రూపొందించడానికి ఏర్పడిన కమిటీ సమావేశం కూడా జరిగింది. విభేదాలు పక్కన పెట్టాలని, బహిరంగంగా ఎవరి మీదా ప్రతికూల వ్యాఖ్యలు చేయకూడదని ఖడ్గే కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

మున్సిపల్ చర్చలు మళ్లీ విఫలం

జీవోఎం దొంకతిరుగుడు నిర్ణయాలపై నేతల తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : మున్సిపల్ కార్మిక సంఘాలతో ప్రభుత్వం శనివారం జరిపిన చర్చలు మళ్లీ విఫలమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక సంఘాలు, కార్పొరేషన్ల పరిధిలో పనిచేసే పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వారి డిమాండ్లపై మరోసారి చర్చించేందుకు సంబంధిత సంఘాల ప్రతినిధులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో మంత్రుల బృందం సమావేశమైంది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, సీడీఎంఎ కోటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు తదితర అధికారులు పాల్గొన్నారు. చర్చల్లో కార్మిక

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఏందయ్యా ఇది, కండువా తేవడం ఇంత లేటా, ఆయన మనసు మార్చుకుని వెళ్లిపోయాడు!

నీరో చక్రవర్తి జగన్

మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందనేది

విజయవాడ ధర్నాలో రామకృష్ణ

2 లో

15 రోజుల్లో సీట్ల సర్దుబాటు

- ఎవరికి ఏ స్థానం... ఏ పార్టీకి ఎన్ని సీట్లో తేలుతుంది
- 545 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పరిశీలకులు
- కచ్చితమైన సంఖ్యపై త్వరలో ప్రకటన: ఖడ్గే
- 'న్యాయ్' యాత్ర లోగో ఆవిష్కరణ

న్యూఢిల్లీ: మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఇండియా కూటమి ఉక్కు సంకల్పంతో ముందుకెళుతోంది. కలిసి వచ్చే పార్టీలతో కూటమిని బలపర్చుకుంటూ ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. ఎవరు ఎక్కడ నుంచి పోటీ చేయాలని, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వంటి అనేక అంశాలపై సమాలోచనలు జరుపుతోంది.ఏదిఏమైనా ఇండియా కూటమి సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని పట్టుదలగా ఉంది. దీనిపై త్వరలో పూర్తి స్పష్టత వస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే తెలిపారు. మరో 10-15 రోజుల్లో ప్రక్రియ పూర్తి అవుతుందని చెప్పారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర లోగోను పార్టీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్‌తో

- మిగతా 2 లో

బంగ్లాదేశ్‌లో నేడే పోలింగ్

- ఎన్నికల వేళ చెలరేగిన హింస
- రెండు పోలింగ్ బూత్‌లకు, రైలుకు నిప్పు
- నలుగురి దుర్మరణం - అనేకమందికి గాయాలు
- బీఎన్‌పీ 48గంటల సార్వత్రిక సమ్మె

ఢాకా: సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమైన బంగ్లాదేశ్‌లో ఒక్కసారిగా హింస చెలరేగింది. ఆదివారం పోలింగ్ జరగనుంది. అయితే శనివారం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన రెండు బడులకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. చిట్టగాంగ్‌లోని పటేంగా ఇపిజెడ్ ప్రాంతంలో తెల్లవారుజామున 4.30 గంటలకు నిశ్చింత పారా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారని అధికారులు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుని గదికి నిప్పుపెట్టగా అక్కడున్న కొత్త పుస్తకాలు దగ్ధమయ్యాయని సీఎంపీ పోర్ట్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ షకీలా సోల్తానా అన్నారు. బంగ్లాదేశ్, భారత్‌కు సరిహద్దు పట్టణమైన బెనాపోల్ వద్ద ఓ ప్యాసింజర్ రైలుకు దుండగులు నిప్పు పెట్టిన ఘటన శుక్రవారం రాత్రి 9 గంటలకు జరిగింది. ఈ ఘటనలో నాలుగు బోగీలు దగ్ధం కాగా ఓ చిన్నారి సహా నలుగురు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. ప్రయాణికుల్లో దాదాపు 292 మంది భారత్ నుంచి స్వదేశానికి తిరిగివస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. నలుగురి మృతదేహాలు లభ్యమైనట్లు అగ్నిమాపక దళ అధికారి షాజహాన్ సికిందర్ చెప్పారు. ఇదిలావుంటే ఆదివారం జరగబోయే ఎన్నికలను పర్యవేక్షించేందుకు భారత్ నుంచి ముగ్గురు నిపుణులు ఢాకాకు చేరుకున్నారు. మరో 122 మంది కూడా ఇతర దేశాల నుంచి వచ్చారు.

అప్రమత్తంగా ఉన్నాం

మరొక ప్రాథమిక బడికి నిప్పు పెట్టేందుకు కొందరు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారని ఖుల్నా పోలీసు అధికారి సైదుర్ రెహమాన్ తెలిపారు. దుండగుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. తమ దళాలను అప్రమత్తం చేశామన్నారు. 8,00,000 మంది పోలీసులు, పారామిలటరీ దళాలను రంగంలోకి దించినట్లు చెప్పారు. ఎన్నికల వేళ పోలింగ్ బూత్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటున్నదని అన్నారు. దేశంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా త్రివిధ దళాల అధికారులనూ మోహరించినట్లు అధికారులు తెలిపారు.

బీఎన్‌పీ 48 గంటల ఆందోళన

ప్రధాన ప్రతిపక్షమైన బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించింది. ప్రభుత్వాన్ని రద్దు చేసి తటస్థమైన ఆపద్ధర్మ ప్రభుత్వం అధ్వర్యంలో ఎన్నికలు జరపాలని డిమాండ్ చేసింది. ఇందుకు అధికార పక్షం ఒప్పుకోలేదు. దీంతో 48 గంటల ఆందోళనకు దిగింది. బీఎన్‌పీ సీనియర్ అధికారి రుహుల్ కబీర్ రిజ్వి మాట్లాడుతూ బెనాపోల్ ఎక్స్‌ప్రెస్ ఘటనను ఉద్దేశపూర్వకంగా చేసినదిగా అధికార పక్షాన్ని ఉద్దేశించి ఆరోపించారు. మానవాళిపై క్రూరత్వంగా అభివర్ణించారు. అయితే ప్రధాన విపక్షం పోటీలో లేని కారణంగా షేక్ హసీనా వరుసగా నాల్గో సారి గెలుస్తారన్న అంచనాలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో 436 మంది స్వతంత్రులు, 27 పార్టీల నుంచి 1,500 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది.

22,722కు పెరిగిన పలస్తీనా మృతులు

24గంటల్లో 122 మరణాలు

జెరుసలేం: గాజాపై ఇజ్రాయిల్ దురాక్రమణ 91వ రోజు కొనసాగింది. భీకర దాడులతో పలస్తీనా ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రతి క్షణం ఓ యుగంలా గడుపుతున్నారు. తినడానికి ఆహారం లేదు. తాగడానికి మంచినీళ్లు లేవు. గాయపడితే వైద్యం అందదు. చిన్న పిల్లలు సైతం రోజుల తరబడి పస్తులు ఉండాల్సిన దారుణ పరిస్థితి నెలకొన్నది. ఇజ్రాయిల్ తమను ఓ వైపు బాంబులు, తూటాలతో మరోవైపు ఆకలితో చంపేస్తోందని పలస్తీనియన్లు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తంచేశారు. అయితే గత 24 గంటల్లో 122 మంది పలస్తీనియన్లు చనిపోగా మరో 256 మంది ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడినట్లు గాజా ఆరోగ్యశాఖ నివేదించింది. దీంతో శనివారం నాటికి మృతుల సంఖ్య 22,722కు పెరిగిందని, గాయపడిన వారి సంఖ్య 58,166కు చేరిందని, ఆచూకీ లేని వారి సంఖ్య ఏడు వేలుగా ఉన్నదని వెల్లడించింది. గాజాలో మనుగడ సాగించలేని దారుణ పరిస్థితులు ఉన్నాయని ఐరాస ఆవేదన వ్యక్తం చేసింది. యూఎన్ఆర్‌డబ్ల్యుఏ శిబిరాల్లో 1.4 మిలియన్ల మంది ఆశ్రయం పొందుతున్నట్లు తెలిపింది. అయితే వారి ప్రాణాలకు ఎక్కడా రక్షణ లేదని పేర్కొంది. తమ శిబిరాల్లో ఉంటున్న 319 మంది చనిపోయారని, వందల మంది గాయపడ్డారని తెలిపింది. ఐరాస సిబ్బంది 142 మంది చనిపోవడం చరిత్రాత్మకమని, యూఎన్ఆర్‌డబ్ల్యుకు చెందిన 131 భవనాలు ధ్వంసమయ్యాయని వెల్లడించింది.

పాకిస్థాన్ ఎన్నికలు వాయిదా

తీర్మానానికి సెనెట్ ఆమోదం

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో సార్వత్రిక ఎన్నికలు వాయిదా పడే పరిస్థితి ఏర్పడింది. ఇందుకు సంబంధించి ప్రవేశపెట్టిన తీర్మానానికి సెనెట్ ఆమోదం తెలిపింది. దేశాన్ని చలి వణికిస్తుండటంతో ఎన్నికలు వాయిదా వేయాలని ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అయితే ఆర్థికంగా అధ్వాన్న స్థితిలో ఉండటానికి తోడు రాజకీయ అనిశ్చితి, ఉగ్రవాద ఘటనలు క్రమంలో పాకిస్థాన్ ఎన్నికలు వాయిదా పడతాయన్న సంకేతాలు అందాయి. షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 8న ఎన్నికలు జరగాల్సి ఉండగా వాయిదా కోరుతూ స్వతంత్ర సెనేటర్ దిలావర్ ఖాన్ ఎగువసభ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. వణికించే శీతాకాలం, భద్రతాపరమైన సమస్యలు, రాజకీయ అస్థిరత వంటి కారణాలు చూపుతూ ఎన్నికల వాయిదాను కోరారు. గడ్డకట్టే చలిలో ఓటు వేసేందుకు ప్రజలు రాకపోవచ్చని అందులో పేర్కొన్నారు. అయితే మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ పార్టీ పాకిస్థాన్ ముస్లిం లీగ్ ఈ తీర్మానాన్ని వ్యతిరేకించింది. మొత్తం 100 మంది ఉండాల్సిన సభలో కేవలం 14 మంది ఉండగానే తీర్మానాన్ని ఆమోదించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ప్రతిపక్షాలైన పాకిస్థాన్ తెహ్రీక్-ఎ- ఇన్సాఫ్ (పీటీఐ), పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) కూడా ఎన్నికల వాయిదాను వ్యతిరేకించాయి.

వైసీపీ, టీడీపీలో గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ నియోజకవర్గాలు ఉన్నాయి. రాయదుర్గం, మడకశిర, సింగనమల, గూడూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, చిత్తూరు, మదనపల్లె, దర్శి, గిద్దలూరు, తిరువూరు స్థానాల్లో మార్పులు, చేర్పులపై స్పష్టత రాలేదు. నందిగామ, చింతలపూడి, పెందుర్తి, పోడవరం సీట్లపైనా కసరత్తు చేస్తున్నారు. నంద్యాల ఎంపీ స్థానంపైనా ఓ ఆశీశ్రేయానికి రాలేకున్నారు. ఈ మేరకు మార్పులు, చేర్పులు చేసే ఎమ్మెల్యేలను, ఇన్‌ఛార్జ్‌లను తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి పిలిపించారు. సీఎంను కలిసిన వారిలో చాలా మంది అసంతృప్తి గురవుతున్నప్పటికీ, పైకి మాత్రం అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని వెల్లడిస్తున్నారు. వారి సొంత నియోజకవర్గాల్లో వెళ్లాక అనుచరులతో సమావేశాలు నిర్వహించి టికెట్ తమకు ఇవ్వాల్సిందేనని బలప్రదర్శనకు దిగుతున్నారు. ఇప్పటికే తొలి విడతలో 11 మందిని, మలి విడతలో 27 మంది స్థానాలను అధిష్ఠానం మార్పు చేసింది. వారిలో ముగ్గురు ఎంపీలు ఉన్నారు. ఆ రెండు జాబితాల వెల్లడి అనంతరం పెద్దఎత్తున నిరసనలు వచ్చినప్పటికీ అధిష్ఠానం ఖాతరు చేయకుండా ముందుకు సాగుతోంది. సంక్రాంతి నాటికి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థుల జాబితా విడుదలకు వైసీపీ అధిష్ఠానం సిద్ధమైంది.

నీరో చక్రవర్తి జగన్

విశాలాంధ్ర-విజయవాడ: మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 4వ రోజు శనివారం స్థానిక కాళేశ్వరరావు మార్కెట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, నీరో చక్రవర్తికి తేడాలేదని ఎద్దేవా చేశారు. నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించుకుంటే...సీఎం మాత్రం ఎమ్మెల్యేలు, ఎంపీల బదిలీల్లో మునిగిపోయారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులు రోడ్డెక్కారని ఆందోళన వ్యక్తంచేశారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు, యానిమేటర్లు, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, చివరికి వలంటీర్లు సమ్మెలో పాల్గొంటున్నారని చెప్పారు. ఇంతమంది కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తుంటే ముఖ్యమంత్రి ఏమాత్రం స్పందించడం లేదని, ఇలాంటి మూర్ఖ శిఖామణి రాష్ట్రానికి సీఎంగా ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను పోలీసులతో అరెస్టు చేయించడం తప్ప వారిని పిలిచి మాట్లాడలేదన్నారు. సీఎం జగన్ చట్టాన్ని అమలు చేయటం లేదు. కోర్టు తీర్పులు గౌరవించడం లేదు. కనీసం ఆయన రంగంలో దిగి వాగ్దానాలు అమలు చేయటం లేదని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి దిగివచ్చి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సీపీఐ, ఇతర వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకుని ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఆందోళనకు దిగిన కార్మికులను చర్చలంటూ పిలిచి స్వయంగా మాట్లాడటం లేదని, చర్చలు జరిపే వారికి ఎలాంటి అధికారాలు ఇవ్వకుండా ఏమి మాట్లాడగలరని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించటం చేతగాని వైసీపీ ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూస్తున్నామని వ్యాఖ్యలు చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ధర్నాకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడుసార్లు చర్చలకు పిలిచిందని, ఒక్కసారి కూడా తాము పరిష్కారానికి కోరిన డిమాండ్లు పరిష్కరిస్తామని హామీ ఇవ్వలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరామని, సర్వీసును 62 సంవత్సరాలకు పెంచమని అడిగినా సాధ్యం కాదని తేగేసి చెప్పారన్నారు.

సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో వైసీపీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా సీఎం జగన్ పట్టించుకోవటం లేదన్నారు. ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, తాడి పైడయ్య, ఏఐటీయూసీ నగర నాయకులు కొట్టు రమణారావు, వియ్యపు నాగేశ్వరరావు, దుర్గాసి రమణమ్మ, సింగరాజు సాంబశివరావు, తెద్దు వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జక్కి జేమ్స్, వికీ్కి తుపాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య-ఎల్1 అద్భుత విజయం

(మొదటిపేజీ తరువాయి)

ట్రాన్స్ లగ్రాంజియన్ పాయింట్-1 ఇన్సర్షన్ విన్యాసాలను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. భూమి నుంచి సుమారు 1.5 మిలియన్ కి.మీ. దూరంలోని సూర్య-భూమి లగ్రాంజియన్ పాయింట్ 1 (ఎల్1) చుట్టూ ఉన్న హాలో కక్ష్య నుంచి ఆదిత్య ఎల్1 సూర్యుడిని పరిశీలించనుంది. సెప్టెంబరు 2 నుంచి 15 వరకు నాలుగుసార్లు భూకక్ష్య పెంపు విన్యాసాలు చేపట్టారు. సెప్టెంబరు 18 నుంచి శాస్త్రీయ సమాచారం సేకరణ మొదలుపెట్టింది. సెప్టెంబరు 19 సూర్యుడి దిశగా ప్రయాణం ఆరంభించింది. సెప్టెంబరు 30న భూ వాతావరణాన్ని విజయవంతంగా దాటింది. డిసెంబరు 1న ఆదిత్య ఎల్1లోని సోలార్ విండ్ అయాన్ స్పెక్టోమీటర్ (స్విస్), ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్ (ఏఎస్‌పెక్స్) పేలోడ్‌లను ఆపరేట్ చేశారు. డిసెంబరు 8న అతినీలలోహిత తరంగదైర్ఘ్యం సమీపం నుంచి సూట్ పేలోడ్ సూర్యుని పూర్తిస్థాయి ఫోటోలను తీసింది.

భారత్ మరో అరుదైన ఘనత సాధించిందని, దేశ తొలి సోలార్ అబ్జర్వేటరీ ఆదిత్య-ఎల్1 తన గమ్యస్థానాన్ని చేరుకుందని ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఆనందం వెలిబుచ్చారు. అత్యంత సంక్లిష్టమైన అంతరిక్ష యాత్రల్లో మన శాస్త్రవేత్తల అంకితభావానికి ఇది నిదర్శనం. ఈ అద్భుత విజయం సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు. మానవాళి ప్రయోజనాల కోసం శాస్త్రసాంకేతిక రంగాల్లో కొత్త శిఖరాలకు చేరుకునే మన ప్రయాణం కొనసాగుతుందని మోదీ పేర్కొన్నారు. కాగా, ఆదిత్య-ఎల్1 విజయంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో మరో ఘన విజయం అందుకుంది. ఈ ఘనత సాధించిన శాస్త్రవేత్తలకు అభినందనలు. ఈ మిషన్‌తో మానవాళికి ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. సూర్యుడు-భూమి వ్యవస్థపై మన జ్ఞానాన్ని మరింత మెరుగుపరుస్తుంది. ఇస్రో మిషన్లలో మహిళా శాస్త్రవేత్తల కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇది మహిళా సాధికారితను మరింత ఉన్నత కక్ష్యలోకి తీసుకెళ్తుందని రాష్ట్రపతి కొనియాడారు. అటు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖమంత్రి జితేంద్ర సింగ్ స్పందిస్తూ మూన్ వాక్ నుంచి సన్ డ్యాన్స్ వరకు..! ఆదిత్య-ఎల్1 తుది కక్ష్యలోకి చేరుకుంది, ఇస్రోకు అభినందనలని ప్రశంసించారు. సౌర వాతావరణాన్ని లోతుగా అధ్యయనం చేయడం 'ఆదిత్య-ఎల్1' లక్ష్యం. భారత్ తరఫున సూర్యుడిని పరిశోధించేందుకు ఇస్రో చేపట్టిన తొలి మిషన్ ఇదే. గతేడాది సెప్టెంబరు 2న శ్రీహరికోట నుంచి దీన్ని ఇస్రో ప్రయోగాన్ని చేపట్టారు. ఈ వ్యోమనౌక మొత్తం ఏడు పేలోడ్‌లను మోసుకెళ్లింది. సౌర వాతావరణం, సౌర జ్వాలలు, కరోనల్ మాస్ ఎజెక్షన్ తదితర విషయాలను అధ్యయనం చేసేందుకు ఇవి కీలకమైన సమాచారాన్ని అందించనున్నాయి.

15 రోజుల్లో సీట్ల సర్దుబాటు

(మొదటిపేజీ తరువాయి)

కలిసి ఖర్గే శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా సర్వసన్నద్ధమవుతోందని ఆయన అన్నారు. 545 లోక్‌సభ నియోజకవర్గాలపై పార్టీ దృష్టి పెట్టిందని, అన్ని స్థానాలకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని చెప్పారు. ఏ పార్టీ ఎక్కడ నుంచి పోటీ చేస్తుంది, ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని పంపకాలపై కూటమి పార్టీల నాయకులతో చర్చించాక ఖరారు చేయనున్నట్లు ఖర్గే తెలిపారు. మీ పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఓ విలేకరి ప్రశ్నించగా 'అన్ని నియోజకవర్గాల కోసం పార్లమెంటరీ పరిశీలకులను నియమించాం. ప్రతి నియోజకవర్గానికి వెళ్లి, క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలిస్తారు. చివరికి ఇండియా కూటమి నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ప్రతి రాష్ట్రంలో చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే సంఖ్య ఖరారవుతుంది. ప్రతి చోట మాకున్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నాం' అని ఖర్గే బదులిచ్చారు. ప్రధాని అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదరని పక్షంలో పార్లమెంటరీ పరిశీలకులు రంగంలోకి వస్తారని చెప్పారు. కూటమికి నేతృత్వం ఎవరు వహిస్తారని ప్రశ్నకు 'ఇది కౌన్ బనేగా కరోడ్‌పతి' అన్న ప్రశ్న చేసే ఉందని ఖర్గే చమత్కరించారు. 'మేము సమావేశాన్ని నిర్వహిస్తాం.10-15 రోజుల్లో ఎవరికి ఏ స్థానమున్నది నిర్ణయిస్తాం' అని నొక్కిచెప్పారు. సమస్యలకు ఉమ్మడి పరిష్కారాలకు యత్నిస్తున్నామన్నారు. ముకుల్ వాస్నిక్ కన్వీనర్‌గా, అశోక్ గెహ్లాట్, భూపేష్ బాఘేల్ సభ్యులుగా కాంగ్రెస్ ఓ కమిటీని ఏర్పాటు చేసుకుంది. వీరంతా సీట్ల సర్దుబాటుకు చర్చలు జరుపుతున్నారని వెల్లడించారు. 'ఇప్పటికే నా ఇంట్లో ఒక సమావేశం జరిగింది. మా నాయకులు శాయశక్తులు ఒడ్డుతున్నారు. ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై ప్రతి రెండు రోజులకు భేటీ అవుతున్నాం. ఎన్ని సీట్లు డిమాండ్ చేయాలి, ఎన్నింటికి ఒప్పుకోవాలి వంటివి ఖరారు చేస్తున్నాం. వాళ్ల ఫార్ములిటీ పూర్తి చేస్తున్నారు' అని ఖర్గే చెప్పారు. టీసీఎల, సీఎల్పీలతో ముందు సమావేశమైతే, వారు వెళ్లి ఇతర రాష్ట్రాల నాయకులతో మాట్లాడతారని తెలిపారు. 2024 ఎన్నికల్లో వారిని (మోదీ ప్రభుత్వాన్ని) గద్దె దించితే ఈ ఎన్నికల్లోనే మీకు న్యాయం చేకూరుతుంది అని 'న్యాయం జరిగే వరకు' పోరుపై ప్రశ్నకు ఖర్గే సమాధానమిచ్చారు. ఇండియా కూటమి పార్టీలు సంయుక్తంగా ర్యాలీలు, సభలు నిర్వహించనున్నాయని, అవి ఎప్పుడు, ఎక్కడ అనేది త్వరలోనే చర్చించి నిర్ణయిస్తాం అని చెప్పారు. పార్లమెంటులో సమస్యలు లేవనెత్తేందుకు అనుమతించట్లేదని, అందుకే భారత్ జోడో న్యాయ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. మణిపూర్‌లో ఎన్నో దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయి. కానీ ప్రధాని మోదీ అక్కడ చోట్ల ప్రసంగాలిచ్చారు. కానీ ఆ రాష్ట్రానికి వెళ్లలేదు. పార్లమెంటులో మాట్లాడలేదు. దేశ చరిత్రలో తొలిసారి 146 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. అందుకే, మా గళాన్ని వినిపించేందుకు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు భారత్ జోడో న్యాయ యాత్ర చేపడుతున్నామని ఖర్గే వివరించారు. కొత్త కార్మిక చట్టాలు, క్రిమినల్ చట్టాల గురించి మాట్లాడితే ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలను అణచివేసేందుకు ఈడీ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ తమకు ప్రజల వద్దకు వెళ్లడం మినహా మార్గం లేదని వివరించారు. విషయం ఈ యాత్ర ద్వారా తెలియజేస్తామన్నారు.

పార్లమెంట్‌లో అనేక అంశాలు లేవనెత్తాలని యత్నించినప్పటికీ తమకు మాట్లాడే అవకాశం రాలేదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఈనెల 14వ తేదీ నుంచి మార్చి 30వ తేదీ వరకు 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' జరుగనుంది. ఇది 66 రోజులపాటు 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల మీదుగా దాదాపు 6,713 కిలోమీటర్ల పాటు యాత్ర కొనసాగనుంది. 'భారత్ జోడో యాత్ర' పూర్తి స్థాయిలో పాదయాత్ర కాగా.. 'న్యాయ్ యాత్ర' మాత్రం ఎక్కువగా బస్సుల్లో సాగుతుంది. అక్కడక్కడా పాదయాత్ర ఉంటుందని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

అంగన్‌వాడీలపై ఎస్మా

(మొదటిపేజీ తరువాయి)

చట్టాన్ని ప్రయోగించే అధికారం ఉంటుంది. ఈ అవకాశాన్ని వైసీపీ ప్రభుత్వం ఉపయోగించుకుంటూ అంగన్‌వాడీల ఉద్యమంపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధపడింది. మరోవైపు సమ్మె చేసిన కాలానికి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనంలో కోత విధించింది. సుమారు రూ.3,450 తగ్గింది... రూ.8,050 వేతనాన్ని ఖాతాల్లో జమచేసింది. దీనిపై నాయకులు భగ్గుమన్నారు. సీఎం జగన్ అరాచక పాలనకు ఇది పరాకాష్ట అంటూ మండిపడ్డారు. తక్షణమే ఎస్మా ప్రయోగాన్ని ఉపసంహరించాలని, అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్చలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

జగన్ నిరంకుశ వైఖరికి పరాకాష్ట: రామకృష్ణ

అంగన్‌వాడీల సమ్మెపై జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. అంగన్‌వాడీలు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో చిత్తశుద్ధి చూపకుండా సమ్మెపై ఎస్మా ప్రయోగించడం జగన్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట. సమ్మె కాలానికి సంబంధించిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల వేతనంలో కోత విధించి, వేతనాలు తగ్గించి జమ చేయడం మరింత దుర్మార్గం. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ముఖ్యమంత్రి ప్రజా సమస్యలను గాలికొదిలి, కేవలం రాజకీయాలపైనే పరిమితమయ్యారు. ఆందోళనలు చేపట్టిన కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఎమ్మెల్యేలు, ఎంపీల స్థానాలు మార్చినందువల్ల వైసీపీ గెలుపు అసాధ్యం. ఇకనైనా తన వైఖరి మార్చుకోకపోతే మరో మూడు నెలల తర్వాత ఇంటికెళ్లడం ఖాయమని రామకృష్ణ హెచ్చరించారు. తక్షణమే అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగాన్ని విరమించి, సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి కృషిచేయాలని హితవు పలికారు. ప్రజాతంత్రవాదులంతా రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఖండించాలని కోరారు.

అప్రజాస్వామికం: శ్రీనివాసరావు

అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మాను ప్రయోగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 2 జారీ చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా జరుగుతున్న అంగన్‌వాడీల ఎస్మా చట్టపరిధిలోకి తీసుకువచ్చి సమ్మె నిషేధించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుండా...సమ్మె కాలానికి వేతనాల్లో కోత విధించడం దుర్మార్గమని తెలిపారు. న్యాయబద్ధమైన సమ్మెను నిరంకుశ చర్యల ద్వారా విచ్ఛిన్నం చేయాలనుకోవడం అవివేకమన్నారు. కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లో రాష్ట్ర ప్రభుత్వం నడుస్తూ ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తోందన్నారు. ఇదే వైఖరి కొనసాగితే జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

అమ్మనే గెంటేసినవాడికి...నారా లోకేష్

అమ్మనే గెంటేసిన వాడికి అంగన్‌వాడీల విలువ ఏమి తెలుస్తుందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోమని శాంతియుత నిరసనలు తెలపడం కూడా నేరమేనా? అంగన్వాడీ ఉద్యమంపై సైకో సర్కార్ ఉక్కుపాదం మోపడం దారుణం. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం, సమ్మె కాలానికి వేతనంలో కోత పెట్టడం, జగన్ నియంత పోకడలకు పరాకాష్టగా పేర్కొన్నారు.

జగన్ అసమర్థ పాలనకు నిదర్శనం: కాంగ్రెస్

డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కారం చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు జంగా గౌతమ్ తీవ్రంగా ఖండించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా అంగన్‌వాడీలకు అనేక హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా...అడిగితే ఉక్కుపాదం మోపుతున్నారని విమర్శించారు. అంగన్‌వాడీలపై నిర్బంధం సీఎం జగన్ అసమర్థ పాలనకు నిదర్శనమని తెలిపారు.

మున్సిపల్ చర్చలు మళ్లీ విఫలం

(మొదటిపేజీ తరువాయి)

సంఘాల తరఫున ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సీఐటీయూ నాయకులు ఉమామహేశ్వరరావు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేసే వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆసుల రంగనాయకులు, కోటి మాల్యాద్రి, వి.రవికుమార్, జె.రమణయ్యలతోపాటు, బాబా ఫక్రుద్దీన్, వరప్రసాద్, కె.శ్రీనివాసరావు, ఆర్.సత్యం, ఇ.మధుబాబు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రస్తుతం ఇచ్చే రూ.15 వేల జీతంతో పాటు 6 వేలు హెల్త్ అలవెన్స్ కింద చెల్లిస్తుందగా, ఇకపై జీతంతో కలిపి ఇస్తామని, దానివల్ల జీతం రూ.21 వేలకు పెరిగినట్లు అవుతుందని మంత్రుల బృందం తెలిపింది. దానిని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అది జీతం పెంచినట్లు ఎలా అవుతుందని ప్రశ్నించారు. మరికొన్ని ఇతర సమస్యలపై కూడా పరిష్కార మార్గాలపై జీవోపూర్తి స్పష్టత ఇవ్వకుండా దొంకతిరుగుడుగా ముఖ్యపెట్టే ప్రయత్నం చేయడం తో కార్మిక సంఘాల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రచార కమిటీ, వార్ రూమ్‌లు సిద్ధం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఒక్కొక్కటిగా పనులను వేగంగా చేపడుతోంది. ఎన్నికల కోసం అభ్యర్థులను ఎంపికకు ఐదు స్క్రీనింగ్ కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేసింది. ఇందుకోసం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఐదు క్లస్టర్లుగా విభజించింది. తాజాగా ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ కన్వీనర్‌గా పార్టీ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సభ్యులుగా ప్రచార కమిటీని శనివారం ఏర్పాటు చేసింది. కేంద్ర వార్‌రూమ్‌లను సిద్ధం చేసింది. కమ్యూనికేషన్స్ (సంప్రదింపుల) వార్ రూమ్ బాధ్యతలను సైన్ పాలిటిక్స్ సంస్థ అధిపతి శశికాంత్ సెంథిల్ ఎస్‌కు కట్టబెట్టింది. దీనికి వైస్ చైర్మన్‌గా కెప్టెన్ అరవింద్ కుమార్, వరుణ్ సంతోష్, గోకుల్ బుటైల్ నియమితులయ్యారు. సంప్రదింపుల వార్ రూమ్‌లో సభ్యులుగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థ) కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంప్రదింపులు) జైరాం రమేశ్, ఏఐసీసీ ఇన్‌ఛార్జి (పరిపాలన) గురదీప్ సింగ్ సప్పల్, ఏఐసీసీ మీడియా, ప్రచార శాఖ చైర్‌పర్సన్ పవన్ ఖేరా, ఏఐసీసీ సామాజిక మాధ్యమాల శాఖ చైర్‌పర్సన్ శ్రీనేత్ ఉంటారు.

యువతే భావి భారత నిర్మాతలు

అనంతపురం జేఎన్టీయూ 13వ స్నాతకోత్సవ సభలో గవర్నర్

అనంతపురం- జేఎన్‌టీయూ: విద్యార్థులు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, భావిభారత నిర్మాతలుగా ఎదగాలని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసంతో విజేతలు కావాలని ఆకాంక్షించారు. పట్టుదల కృషి ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతపురం జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూఏ) 13వ స్నాతకోత్సవం ఎస్ఏటీ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథిగా గవర్నర్ నజీర్, ముఖ్య వక్తలుగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ రాజు, కర్నాటక, బెళగావిలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బాల వీరారెడ్డి విశ్వేశ్వరయ్య హాజరయ్యారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ రంగజనార్దన అధ్యక్షత వహించారు. గవర్నర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో ఒక కుగ్రామంగా సాంకేతిక రంగం ఉందని గవర్నర్ అన్నారు. ఉన్నత ప్రమాణాలతో జ్ఞాన సంపద, విద్య, వైద్యం ,ఆర్థిక అభివృద్ధి, సమకాలీన ప్రగతితో దేశాన్ని ప్రపంచ పటంలో ఆదర్శంగా నిలిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. అనంతరం నూతనంగా నిర్మించిన మూడు అంతస్తుల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. విద్యార్థులకు బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలు అందజేశారు. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ జి.రంగ జనార్దన మాట్లాడుతూ స్నాతకోత్సవంలో 86,142 మంది విద్యార్థులకు డిగ్రీలు, 71 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 67 మంది అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు బంగారు పతకాలు అందజేసినట్లు తెలిపారు. 68,963 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్, 15,805 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్, 1,109 డాక్టర్ ఆఫ్ ఫార్మసీ, 265 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ, 1,042 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, ఉన్నత విద్య మండలి సలహాదారులు అంజనేయులు, జేఎన్‌టీయూ రెక్టర్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి రూ.259 కోట్ల విరాళాలు

- 2022-23లో ఎన్నికల ట్రస్టుల ద్వారా 70 శాతం నిధులు
- కేంద్ర ఎన్నికల సంఘం గణాంకాలు వెల్లడి

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 2022-23లో ఎన్నికల ట్రస్టుల ద్వారా మొత్తం విరాళాలలో 70 శాతానికి పైగా పొందిందని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గణాంకాలు పేర్కొన్నాయి. ఈసీఐకి తమ వార్షిక నివేదికలను సమర్పించిన ఐదు ఎన్నికల ట్రస్టులు సేకరించిన మొత్తం రూ.366 కోట్లలో కాషాయ పార్టీకి రూ.259.08 కోట్లు అందాయి. మేఘా ఇంజనీరింగ్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ నుంచి అత్యధికంగా 87 కోట్ల రూపాయల కార్పొరేట్ విరాళం వచ్చింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ వరుసగా రూ.50.25 కోట్లు, రూ.50 కోట్లు ఈ ట్రస్టుల ద్వారా రాజకీయ నిధుల రూపంలో వచ్చాయి. కార్పొరేషన్లు, వ్యక్తుల ద్వారా రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే దానికి 2013లో ఐక్య ప్రగతిశీల కూటమి (యూపీఏ-2) పాలనలో ఎన్నికల ట్రస్టులను ప్రవేశపెట్టారు. అయితే అవాయక ఎన్నికల బాండ్ల మాదిరిగా కాకుండా ఈ ట్రస్టులు తమ విరాళాల నివేదికలను ప్రతి సంవత్సరం ఈసీఐకి వెల్లడించాలి. ఎన్నికల ట్రస్టులు తమ విరాళాలలో కనీసం 95 శాతం రాజకీయ పార్టీలకు పంపిణీ చేయాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. అయితే, 2022-23లో ఈ ట్రస్టులు తమ విరాళాలలో 99.99 శాతం రాజకీయ పార్టీలకు పంపిణీ చేశాయి. 2022-23లో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డులో నమోదైన 18 ఎన్నికల ట్రస్టులకుగాను 13 తమ నివేదికలను ఈసీఐకి సమర్పించాయి. కేవలం ఐదు ట్రస్టుల మాత్రమే కార్పొరేట్ల నుంచి విరాళాలు అందుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. మొత్తం ఆసక్తికరంగా, 39 కార్పొరేట్లు నుంచి ఐదు ట్రస్టులు అందుకున్న మొత్తం రూ.366 కోట్లలో 90 శాతానికి పైగా విరాళాలు 10 వ్యాపార సంస్థల నుంచి వచ్చాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) విశ్లేషణ పేర్కొంది. మొత్తం విరాళాలలో ప్రుడెంట్ ఎన్నికల ట్రస్టుకు మాత్రమే రూ.360.46 కోట్లు వచ్చాయి. ఇందులో ప్రముఖ 10 కార్పొరేట్లు రూ.332.26 కోట్లు వచ్చాయి. పోల్చితే, సమాజ్ ఎన్నికల ట్రస్టుకు ఒక కంపెనీ మాత్రమే రూ.2 కోట్లు, పారిబర్తన్ ఎన్నికల ట్రస్టుకు రెండు కంపెనీలు రూ.75.50 లక్షలు, ట్రయంఫ్ ఎన్నికల ట్రస్టుకు రెండు కంపెనీలు రూ.50 లక్షల విరాళాన్ని అందించాయి. 2022-23లో ఎన్నికల ట్రస్టులకు కేవలం 11 మంది మాత్రమే విరాళమిచ్చారు. వారిలో మంది వ్యక్తులు ప్రుడెంట్ ఎన్నికల ట్రస్టుకు రూ.2.70 కోట్లు, ముగ్గురు వ్యక్తులు ఎయింజాగ్గిగ్ ఎన్నికల ట్రస్టుకు రూ.8 లక్షలు విరాళంగా అందించారని ఏడీఆర్ నివేదిక తెలిపింది.

సింహభాగం బీజేపీకే...

ప్రుడెంట్ ఎన్నికల ట్రస్టు తన విరాళాలలో సింహభాగం బీజేపీకి రూ.256.25 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఇది తన మిగిలిన విరాళాలను భారత రాష్ట్ర సమితి (బీఆర్ ఎస్) కి రూ.90 కోట్లు ఇచ్చింది. మిగిలిన రూ.17 కోట్లను కాంగ్రెస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీకి విరాళాలుగా ఇచ్చింది. సమాజ్ నుంచి కాషాయ పార్టీకి రూ.1.50 కోట్లు విరాళంగా వచ్చాయి. సమాజ్ నుంచి కాంగ్రెస్ కు రూ.50 లక్షలు మాత్రమే వచ్చాయి. ముందున్న సత్య ఎన్నికల ట్రస్టు అని పిలువబడే ప్రుడెంట్ ఎన్నికల ట్రస్టు, ఇతర సమిష్టి ఎన్నికల ట్రస్టులతో పోలిస్తే విరాళాల గరిష్ట వాటాను స్థిరంగా పొందింది. దాని దాతలలో భారతీ ఎయిర్‌టెల్ గ్రూప్, డీఎల్ఎఫ్ గ్రూప్, యాపిల్, టొరెంట్ పవర్, డీసీఎం (శ్రీరామ్, కాడియా గ్రూప్, హల్దియా ఎనర్జీ మొదలైన కొన్ని అతిపెద్ద వ్యాపార సమ్మేళనాలు ఉన్నాయి. దీనిని 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు స్థాపించారు. సునీల్ మిట్టల్ నేతృత్వంలోని కార్పొరేషన్‌తో అనుబంధించడం దాదాపు 33 కంపెనీల సహకారంతో న్యూఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లోని భారతీ గ్రూప్ ప్రాంగణంలో దీని నిర్వహించబడుతుంది.

ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరు: రావులపల్లి

విశాలాంధ్ర-గుంటూరు: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు తమ పోరాటం ఆగబోదని ఏఐటీయూసీ ఏపీ అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తేల్చిచెప్పారు. మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ అధ్వర్యంలో గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె శిబిరాన్ని రావులపల్లి శనివారం సందర్శించారు. సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాడదామని కార్మికులకు పిలుపునిచ్చారు. అన్ని సమయాల్లో అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని ఎందుకు నెరవేర్చడం లేదని సీఎం జగన్‌ను నిలదీశారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా సన్మానాలతో సరిపెట్టారని విమర్శించారు. ప్రాణాలను పణంగా పెట్టి నగర సుందరీకరణకు పని చేసే పారిశుద్ధ్య కార్మికులతో ప్రభుత్వం వ్యవహరించే తీరు సరైనది కాదన్నారు. ముఖ్యమంత్రి తక్షణమే మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రావులపల్లి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, యూనియన్ గౌరవాధ్యక్షుడు చిన్నపోతుల వెంకటరావు, కోశాధికారి కోటి వీరాంజేయులు, నేతలు భాస్కర్, సద్గుణరావు, ఎలిషారావు, జీవన్‌కుమార్, సువార్తమ్మ, మరియమ్మ, శ్రీను, రమాదేవి, విజయ్‌కుమార్, అన్నపూర్ణమ్మ, లక్ష్మణ, సుబ్రమణ్యం, బాలాజి పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం దుర్మార్గం: వెలుగూరి

విశాలాంధ్ర-నరసరావుపేట: అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మా ప్రయోగించడం ప్రభుత్వ దమననీతికి నిదర్శనమని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి మండిపడ్డారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం వెలుగూరి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడానికి బదులు ఎస్మా చట్టాన్ని ప్రయోగించి సమ్మె అణచివేతకు పూనుకోవటం దుర్మార్గమని, ఇది పిచ్చుకపై బ్రహ్మాస్త్రం లాంటి చర్య అని వెలుగూరి అన్నారు. విద్యుత్తు, నీటి సరఫరా, హాస్పిటల్స్ లాంటి అత్యవసర సర్వీసు రంగాలలో మాత్రమే ఎస్మా ప్రయోగిస్తారని, అంగన్‌వాడీ కేంద్రాలు అత్యవసర సర్వీసుల కిందకు రావని అన్నారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, మేడా హనుమంతరావు, ఏఐటీయూసీ నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీల అమలు ప్రభుత్వ కర్తవ్యం

అంగన్‌వాడీ, మున్సిపల్ కార్మికులకు ముప్పాళ్ల సంఘీభావం

విశాలాంధ్ర-వినుకొండ: కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు నొక్కిచెప్పారు. మాట తప్పి... ఎస్మా ప్రయోగించడం, బెదిరింపులకు పాల్పడటం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. వీటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బెదిరింపులను ఉమ్మడిగా తిప్పికొట్టాలని, ఇటువంటి బెదిరింపులకు భయపడాల్సిన పని లేదని కార్మికులకు పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించుకుండా భయపెట్టే ప్రయత్నాలు చేయడం పద్ధతి కాదని ప్రభుత్వానికి హితవు పలికారు. కార్మికుల నాయకులను చర్చలకు పిలిచి, రాజీకి ప్రయత్నించాలని సూచించారు. కార్మికులకు ఇచ్చిన హామీల అమలులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. ముప్పాళ్ల శనివారం గుంటూరు, సురేశ్ మహల్ రోడ్డులోని అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించిన ప్రభుత్వం డౌన్ డౌన్ అంటూ శిబిరంలోని వారంతా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అనంతరం మున్సిపల్ కార్మికుల శిబిరానికి వెళ్లి వాళ్ల సమ్మెకు ముప్పాళ్ల నాగేశ్వరరావు మద్దతు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం, రూ.26వేల కనీస వేతనం, ఒప్పంద కార్మికుల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారాన్ని తమ కర్తవ్యంగా భావించాలని, కార్మిక నాయకులను చర్చలకు పిలిచి, వారి న్యాయమైన డిమాండ్లు, సమస్యలను పరిష్కరించాలని, సమ్మెలను విరమింపజేయించాలని ప్రభుత్వానికి ముప్పాళ్ల నాగేశ్వరావు సూచించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, ఏఐటీయూసీ నేత బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం నేత ఉలవలపూడి రాము, ప్రజా సంఘాల కార్యకర్తలు, అంగన్‌వాడీ జిల్లా కోశాధికారి లక్ష్మీ ప్రసన్న, నాయకులు మున్ని, కె.విజయ. పి.ఉమాశంకరి, జి.పద్మ, శ్రీదేవి, నాగజ్యోతి, బీబీ, నిర్మల, గాయత్రి, తిరుమల దేవి, సీపీఐ నాయకులు పిన్ని బోయిన వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికుల యూనియన్ ఉపాధ్యక్షులు బూదాల చిన్న సోమవరపు దావీదు, నేతలు సంపెంగుల రాజు, శామంతపూడి సాయిబాబు, కంచర్ల కోటేశ్వరరావు, ఏసుపాదం, పచ్చిగొర్ల ఏసు, వేముల శ్రీనివాసరావు, నంబూరు దేవయ్య బత్తుల నాగేశ్వరావు, సంపెంగుల మోషే, సంపెంగుల జాను, ఇశ్రాయేలు, పోలయ్య, షేక్ లాల్‌బాషా, పల్లెపు కోటయ్య, అక్కయ్య, మరియ బాబు, నాగరాణి, మార్తమ్మ, బక్క కొండమ్మ, గురమ్మ, దేవమ్మ, కుమారి, మోహిని, వెంకటరమణ, రాయేలమ్మ, చిన్న మరియమ్మ, మాట నాగరాణి, యేసు రత్నం, ఇశ్రాయేలు, అల్లూరయ్య, రామకోటేశ్వరరావు, పల్లె ఏసోబు పాల్గొన్నారు.

ఉధృతంగా మున్సిపల్ కార్మికుల సమ్మె

- రాజమహేంద్రవరంలో భారీ ర్యాలీ
- హక్కులు సాధించుకునే వరకు ఉద్యమం ఆగదు: జి.ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-రాజమహేంద్రవరం: రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతోంది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు రోడ్డెక్కారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. శనివారం రాజమహేంద్రవరంలో కార్మిక సంఘాల అధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెల్లి పేట నుంచి ప్రారంభమైన ర్యాలీ శ్యామల సెంటర్, మెయిన్ రోడ్, కోటగుమ్మం, జాంపేట మీదుగా గోకవరం బస్టాండ్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకుంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు కార్మికుల ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రంలో 75 మున్సిపాలిటీలు, 25 నగరపాలక పంచాయతీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో అన్ని విభాగాల కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. సమ్మెలో ఏఐటీయూసీ మాత్రమే కాకుండా మరో ఆరు సంఘాలు ఉన్నాయన్నారు. ఈ సమ్మె వల్ల రాజమండ్రి నగరమే కాకుండా ఆంధ్ర ప్రదేశ్ మొత్తం 26 జిల్లాల్లో చెత్తాచెదారం పెరిగిపోవడంతో ప్రజలకు వ్యాధులు సోకే అవకాశం ప్రమాదం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా మున్సిపల్ కార్మికుల సమ్మెను సామరస్యంగా పరిష్కరించే ఆలోచన చేయడం లేదని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, అందరికీ గ్రాట్యూటీ, ఈఎస్ఐ సౌకర్యం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు ఓర్పుతో ఉద్యమం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు, యూనియన్ నాయకులు రెడ్డి రమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం.శివ, గోడం గిరి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మాను ఉపసంహరించుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి డిమాండ్
- తిరుపతి నగరంలో ఏఐటీయూసీ ఆందోళన

విశాలాంధ్ర-తిరుపతి: అంగన్‌వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు-2ను తీసుకువచ్చి అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మా ప్రయోగిస్తామని ప్రకటించడం దారుణమని, దానిని వెంటనే ఉపసంహరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. 26 రోజులుగా రాష్ట్రంలో లక్షా 6 వేల మంది అంగన్‌వాడీ కార్మికులు సమ్మె బాట పట్టారని, వారితో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన నాలుగు దఫాల చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను, పోలీసులను, ఐసీడీఎస్ అధికారులను, జిల్లా కలెక్టర్లను ప్రయోగించి బెదిరింపు చర్యలకు పూనుకుంటోందని విమర్శించారు. అయినప్పటికీ అంగన్‌వాడీ కార్మికులు మొక్కవోని దీక్షతో సమ్మెను విజయవంతంగా నిర్వహిస్తున్నారని, వారికి ఏఐటీయూసీ, సీపీఐ అభినందనలు తెలియజేస్తోందన్నారు. అంగన్‌వాడీ కార్మికులపై ఎస్మాను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అధ్వర్యంలో తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా హరినాథ రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి రాధాకృష్ణ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా హరినాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పిరికిపంద చర్యలు చేపట్టిందని, ఎస్మా ఎవరిపైన ఉపయోగించాలో కూడా తెలియని స్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రాష్ట్రంలో కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెబాట పట్టినా సీఎం జగన్‌కు బుద్ధి రావడం లేదన్నారు. కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకుండా, వారిని రెచ్చగొట్టి సమ్మె వరకు తీసుకురావడానికి కారణ ముఖ్యమంత్రేనని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఎస్మాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథం, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్.డి.రవి, నాయకులు సిహెచ్ శివకుమార్, ఎన్.శివ, కె.వై.రాజా, ఉదయ్ కుమార్, నగర నాయకులు శ్రీనివాసులు, మహేంద్ర, వెంకటేష్, ప్రమీల, మీనా, చలపతి, పద్మనాభరెడ్డి, ఆర్.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల విధానాలే వ్యవసాయానికి శాపం

రైతుసంఘం మహాసభలో నేతల విమర్శ

విశాలాంధ్ర-యర్రగుంట్ల: పాలకుల తప్పుడు విధానాల కారణంగా వ్యవసాయ రంగం కుదేలైందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.కాటమయ్య ధ్వజమెత్తారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణం రైతు సంఘం 19వ జిల్లా మహాసభలకు వేదికైంది. ఈ సందర్భంగా శనివారం జరిగిన బహిరంగ సభలో కాటమయ్య మాట్లాడుతూ రైతులు దుర్భర జీవితం అనుభవిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని ఉద్దేశపూర్వకంగానే పాలకులు ధ్వంసం చేస్తున్నట్లు ఆరోపించారు. ఫలితంగానే నూతన సాగు చట్టం, విద్యుత్ ప్రైవేటీకరణ బిల్లు వంటి అంశాలు తెరపైకి వచ్చాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్ల బకాయిలు రద్దు చేసిన మోదీ ప్రభుత్వం రైతు రుణాలు మాఫీ చేయడానికి వెనకాడుతోందని కాటమయ్య విమర్శించారు. అన్నదాతలపై ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. పీఎం కిసాన్, రైతు భరోసా పేరిట ఏడాదికి రూ.13,500 ఇస్తూ పండుగ చేసుకోమని చెప్పడం దారుణమన్నారు. ఈ డబ్బుతో ఎలా పండుగ చేసుకోవాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్ సర్కారు సైతం రైతుల పట్ల వివక్ష చూపుతోందని మండిపడ్డారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కడపను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకొనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వర్షాలు లేక పంటలు ఎండిపోయినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో అనేక ప్రాజెక్టులు ఉన్నప్పటికీ పంట కాలువల నిర్మాణం లేకపోవడం రైతులకు శాపంగా మారిందని ఈశ్వరయ్య అన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కర్షకులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. కరువు కారణంగా కొనసాగుతున్న వలసలను నివారించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మహత్యల నియంత్రణకు నిధులు కేటాయించి ఆదుకోవాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఆహార ఉత్పత్తులకు సంబంధించి దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల శ్రమను దోచుకుంటున్నారని చెప్పారు. రైతులు సంఘటితంగా పోరాడటం ద్వారా ప్రభుత్వాల మెడలు వంచాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోటిరెడ్డి భాస్కర్, జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి, టి.మనోహర్‌రెడ్డి, మహిళా సమాఖ్య నేత బషీరున్నీసా, విజయలక్ష్మీ, ఏఐటీయూసీ నేతలు బాదుల్లా, శ్రీరాములు, మునెయ్య, ప్రజానాట్యమండలి నాయకులు పల్లవోలు రమణ, నాగరాజు, రమేశ్, శివరాం, ప్రసాద్, నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నేతలు వలరాజు, చంద్ర, శరత్, లీలాకృష్ణ, భవానీశంకర్, రాధాకృష్ణ, బ్రహ్మం, మనోహర్‌బాబు, ఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పుల్లయ్య, బాలచంద్ర, మల్లికార్జునరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, యానాదయ్య, చెన్నారెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్మా ప్రయోగం కిరాతకం: కత్తి నరసింహా రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్మికులు, సహాయకులపై ఎస్మా ప్రయోగించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి అన్నారు. తెలంగాణ కంటే ఎక్కువ జీతం ఇస్తామని చెప్పి అంగన్‌వాడీలను మోసం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేజీబీవీ టీచర్లు, ఎస్ఎస్ఏ సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ ఇస్తామని నాలుగేళ్ల క్రితమే రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. హామీలు అమలు చేయనందునే కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వస్తోందని, ఇలాంటి పరిస్థితి ప్రభుత్వమే కల్పించిందని దుయ్యబట్టారు. కార్మిక నేతలను చర్చలకు ఆహ్వానించి, సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కత్తి నరసింహా రెడ్డి డిమాండ్ చేశారు.

ఇస్రోకు జగన్ అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆదిత్య ఎల్-1 ప్రయోగం తుదిదశ విజయవంతం కావడంతో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఆదిత్య ఎల్-1 అద్భుత విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘన వ్యర్థాలు ఉప ఉత్పత్తులుగా మార్పు సులభం

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ఎస్‌సీఎస్ రాజశేఖర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఘన వ్యర్థాలను ఉప ఉత్పత్తులుగా మార్చటం ద్వారా వాటి నిర్వహణ సులభతరం అవుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ అధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ శనివారం విజయవాడ అమ్మ కళ్యాణ మండపంలో 'ఇంటిగ్రేటెడ్ అండ్ సస్టైనబుల్ సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎల్ఆర్ఎం)' ప్రాజెక్టు నమూనాలపై జిల్లా అధికారులకు ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన 'చెత్త నుంచి సంపద' విధానాన్ని ప్రధానంగా వర్క్‌షాప్ నొక్కి చెప్పింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ అత్యావశ్యకమన్నారు. ప్రతి గ్రామం ఆర్థికంగా నిలదొక్కుకునేలా, ఇందుకు అవసరమైన అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇంటిగ్రేటెడ్ అండ్ సస్టైనబుల్ సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు సి.శ్రీనివాసన్ పురపాలక, గ్రామీణ ప్రాంతాల ఘన వ్యర్థాలను వివిధ పద్ధతుల ద్వారా సంపదగా మార్చాల్సిన ప్రాముఖ్యతను వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన వివిధ పద్ధతులను సోదాహరణంగా వివరించారు. ఘన వ్యర్థాలను కాలక్రమేణా కుళ్లిపోయేలా వదిలివేయడం వల్ల కలిగే ప్రభావాలను తెలియజేశారు. టాటా ట్రస్ట్ ప్రతినిధి మనోజ్ గ్రామాలకు నమ్మదగిన, స్థిరమైన ద్రవ వ్యర్థాల నిర్వహణ సూత్రాలను అందించారు. ఆర్థికంగా లాభదాయకమైన నమూనాల ద్వారా ద్రవ వ్యర్థాలను పర్యావరణపరంగా సురక్షితమైన మార్గంలో, శుద్ధి చేసిన నీటిగా మార్చడానికి అనుసరించవలసిన పద్ధతులను వివరించారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ తదితరులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా

చంద్రశేఖర్ రెడ్డి హామీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామీణ రక్షిత సమగ్ర పథకాలలో వివిధ స్కీములలో విధులు నిర్వహిస్తున్న కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చడంపై ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతానని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమసంఘం సలహాదారు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామీణ రక్షిత పథకాల (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగా ల్లోని సమగ్ర రక్షణ నీటి వనరుల (సీపీడబ్ల్యూ) స్కీముల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల రాష్ట్ర సమావేశాన్ని విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించారు. దీనికి యూనియన్ గౌరవాధ్యక్షుడు వినుకొండ రాజారావు అధ్యక్షత వహించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా రెండు లక్షల మంది ఉద్యోగులకు భరోసా కల్పించి... ఆదుకున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ సమగ్ర నీటి సరఫరా విభాగాల్లో వివిధ క్యాడర్లు, ఎలక్ట్రీషియన్లు, లైన్‌మెన్, ఫిట్టర్లు, అటెండర్లు తదితరులు 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని, వారందరినీ కాంట్రాక్టు వ్యవస్థ నుంచి ఆప్కాస్‌లోకి చేర్చడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. వినుకొండ రాజారావు మాట్లాడుతూ కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకోవటం దారుణమని, ప్రభుత్వం వెంటనే వారిని ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. డాక్టర్ గోచిపాతల శ్రీనివాస్ మాట్లాడుతూ పేద వర్గాల అంటరానితనం పోగొట్టడానికి అంబేద్కర్ పుట్టాడని, పేదరికాన్ని తరిమికొట్టడానికి సీఎం జగన్ పుట్టారన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాయుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌బాబు, గోపాల్, మల్లికార్జున్, కృష్ణతదితరులు మాట్లాడారు. వినుకొండ రాజారావు, ఉపాధ్యక్షుడు బోయిన శ్రీనివాసులు, అసోసియేట్ ప్రెసిడెంట్ హేమలత, ఉపాధ్యక్షురాలు కె.పద్మ, సలహాదారులు ఎంకేవీ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ సురేంద్ర, ఆవుల కల్యాణి, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కార్మికులు సభలో పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య

విశాలాంధ్ర-బనగానపల్లె: స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రథమ మహాసభ బనగానపల్లెలోని నూకల రెసిడెన్సి ఫంక్షన్ హాలులో శనివారం జరిగింది. రైతు సంఘం జిల్లా నాయకులు నారాయణ, సోమన్న, వెంకటశివుడు, సుబ్బారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి భీమలింగప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, కార్యవర్గ సభ్యులు భాస్కర్, రైతు సంఘం నాయకులు నరసింహులు, ఏఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని జీఎం టాకీస్ కూడలి నుంచి ర్యాలీగా బయలుదేరి పెట్రోల్ బంక్ సర్కిల్ నూకల రెసిడెన్సి చేరుకుని ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో సంపద సృష్టించేది వ్యవసాయ, పారిశ్రామిక రంగాలేనని అన్నారు. అన్నం పెట్టే రైతన్న ఆత్మహత్య చేసుకుంటున్నాడని, దీనికి ప్రధాన కారణం పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడమేనని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను నివారించడం కోసం కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిటీని ఏర్పాటు చేసిందని, కమిటీ దేశమంతటా తిరిగి రైతుల సమస్యలు తెలుసుకుందన్నారు. రైతులకు పంట రుణాలు మాఫీ చేయాలని, మద్దతు ధర ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని తెలిపారు. అయితే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తే దేశంలో ఆర్థిక సంక్షోభం వస్తుందనడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో స్పష్టం చేస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు మాట్లాడుతూ ఉమ్మడి నంద్యాల జిల్లా వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించిందని తెలిపారు. నెల్లూరు జిల్లా, మద్రాసు రాష్ట్రాలకు మన పోతిరెడ్డిపాడు నీరు తరలిస్తున్నామన్నారు. సీపీఐ ఆనాడు చేసిన పోరాటాల వల్ల మాజీ సీఎం నందమూరి తారక రామారావు ప్రధానమైన కాలువలు నిర్మించి రైతుల సంక్షేమానికి కృషి చేశారన్నారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్ రైతు భరోసా పేరుతో రూ.12,500 రైతులకు నగదు జమ చేస్తానని మోసం చేసి విడతలవారీగా ఇవ్వడం రైతులు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రజానాట్యమండలి శివయ్య, వాసు విప్లవ గీతాలు ఆలపించారు. రైతు సంఘం నాయకులు హిమావులు, సీపీఐ సీనియర్ నాయకులు సంజీవులు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, సహాయ కార్యదర్శి వాసు, ఏఐటీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి శివ బాలకృష్ణ, కుళాయి స్వామి, సుబ్బయ్య, రవి, ఆశీర్వాదం, సీపీఐ బేతంచెర్ల మండల కార్యదర్శి భార్గవ, సూర్యనారాయణ, మద్దిలేటి, ఆశీర్వాదం, వెంకటలక్ష్మి, రామలచ్చమ్మ, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంపాదకీయం

ఏపీకి 'సర్కారు' కావలెను!

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వం గల్లంతయింది. వివిధ వర్గాలు, ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నా, సర్కారుకు ఇసుమంతయినా నొప్పి, బాధ కలగడం లేదు. ఏ మాత్రం స్పందనలేని జగన్ ప్రభుత్వాన్ని చూస్తుంటే, అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా? అన్న అనుమానం తలెత్తుతోంది. అందుకే రాష్ట్రాన్ని పాలించడానికి తక్షణమే ఓ ప్రభుత్వం కావాలి. ఇది అత్యంత అవసరం, అనివార్యం. చిరుద్యోగులు, కార్మికులు సర్కారుపై దండయాత్ర చేశారు. లక్షా 8 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 26వ రోజుకి చేరింది. 50 వేల మంది మున్సిపల్ కార్మికుల సమ్మె 12వ రోజుకి చేరింది. కొత్తగా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. వీఆర్‌ఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వలంటీర్లు ఒకరి తర్వాత ఒకరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత గడిచిన పదేళ్లలో తొలిసారిగా రాష్ట్రం విపరీతమైన ఆందోళనలతో అట్టుడికి పోతున్నది. నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను నిరసన జెండాలు చుట్టుముట్టాయి. ఆందోళనకారుల ఆవేశానికి అర్థమేమిటి, వారి డిమాండ్లు ఏమిటి, వారి అసహనానికి కారణమేమిటి అన్న ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించి, వారి సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అవన్నీ వదిలేసి, వీలైనంత మేరకు వారి ఆందోళనను 'తొక్కేయండి' అని పోలీసులకు బాధ్యతను అప్పగించి, నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం విచారకరం. పైగా 'ఎస్మా' ప్రయోగించి తన నియంతృత్వ నైజాన్ని బయటపెట్టుకుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినవ నీరో చక్రవర్తిలా వ్యవహరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో 'టార్గెట్-175' అనే పిచ్చిభ్రమలో కొట్టుమిట్టాడుతూ, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల పేరులో ఎన్నికల అభ్యర్థులను ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. తమ సీట్లు గల్లంతు కావడంతో మాజీ ఎమ్మెల్యేలు, పాత ఇన్‌ఛార్జులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తూ రోడ్డెక్కుతున్నారు. ఇలా జగన్‌పై ముప్పేట దాడి మొదలైంది. ఓవైపు కార్మికులు, చిరుద్యోగులు, మరోవైపు సొంతపార్టీవారు పెట్టే కుంపట్లకు ఈస్థాయిలో ఒళ్లు కాలుతుందని ఆయన ఊహించి ఉండరు. ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) ఉద్యోగులు రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం వద్ద ధర్నా చేసేందుకు వచ్చిన ఉద్యోగులపై 'ఖాకీ' జులుం ప్రదర్శించింది. ఉద్యోగులను పోలీసులు ఈడ్చిపడేశారు. మహిళలని చూడకుండా బలవంతంగా బస్సుల్లోకి ఎక్కించారు. తమను ఎక్కడికి తరలిస్తున్నారో తెలియక వారు కొద్దిసేపు భయపడ్డారు. ఎస్‌ఎస్‌ఏ కార్యాలయానికి సమీపంలో దుకాణాల్లో కూర్చున్నవారిని సైతం బయటకు లాక్కొచ్చి మరీ నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆటోల్లో వెళుతున్న వారి సెల్‌ఫోన్లు బలవంతంగా తీసుకొని వాట్సాప్‌లు తనిఖీ చేశారు. ఎస్‌ఎస్‌ఏకు సంబంధించిన ఏ ఒక్క సందేశం ఉన్నా వెంటనే అక్కడికక్కడే అరెస్టు చేశారు. సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు డిసెంబరు 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. రాష్ట్ర కార్యాలయ ముట్టడికి ఇచ్చిన పిలుపును విచ్ఛిన్నం చేసే క్రమంలో పోలీసులు తమలోని రాక్షసత్వాన్ని బయటపెట్టారు. నిజానికి ఉద్యోగులు వేలాదిమంది ముట్టడికి తరలిరావడంతో పోలీసులు విస్తుపోయారు. వారిని బారికేడ్లు ఆపలేకపోయాయి. 1500 మందికిపైగా ఉద్యోగులు అరెస్టయ్యారు. ఇది జరిగి... 24 గంటలు గడవకముందే, మున్సిపల్ కార్మికులు సైతం నగర పాలక సంస్థలు, పురపాలక సంస్థల కార్యాలయాలను ముట్టడించారు. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నది వారి డిమాండ్. పోలీసులు ఎక్కడికక్కడే మోహరించి, విచక్షణారహితంగా లాఠీలతో కొడుతూ, ఆందోళనను అణగదొక్కే ప్రయత్నం చేశారు. ఇప్పటికే మున్సిపల్ కార్మికులు వివిధరూపాల్లో వినూత్న నిరసనలు తెలియజేస్తూ బాధలను బయటకు చెప్పుకుంటున్నారు. వీరి సమ్మెతో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోయింది. నగరాలు, పట్టణాలు దుర్గంధపూరితమయ్యాయి. ప్రభుత్వ అలసత్వాన్ని ప్రజలు గర్హిస్తున్నా, జగన్ గుండె కరగడం లేదు. ఇక వీఆర్‌ఏలూ ప్రభుత్వంపై పోరాటానికి సమాయత్తమయ్యారు. వీఆర్‌ఏ సంఘాలు జేఏసీగా ఏర్పడి, సర్కారుకు అల్టిమేటం పంపించాయి. సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద వారు ధర్నాకు దిగారు. వీరుకాకుండా కేజీబీవీ టీచర్లు, ఆశావర్కర్లు, వలంటీర్లు, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది... ఇలా ఒక్కో శాఖ ఉద్యోగులూ తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. అంగన్‌వాడీ, మున్సిపల్ సిబ్బంది సమ్మె కారణంగా వారి పనుల భారం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులపై పడింది. చిన్నారులు, గర్భవతులు, బాలింతలకు పోషకాహారం అందించే అంగన్‌వాడీ సిబ్బంది పట్ల ప్రభుత్వం కర్కశంగా ప్రవర్తించడాన్ని వైసీపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ ఖండించాయి. కానీ వామపక్షాలు తప్ప ఇతర పార్టీలేవీ వారి ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొనడం లేదనేది వాస్తవం. పార్టీలన్నీ ఈ పోరులో భాగస్వామ్యమైతే తీరే వేరు. ఈ సమ్మెపై మంత్రులు సానుకూలంగా స్పందించకపోగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. అన్నం పెట్టమని అడిగితే డొక్కమీద తంతామని అంటున్నారు. మంత్రులు వాక్‌శుద్ధి చేసుకోవడం ఉత్తమం. తాజాగా వారిపై ఎస్మా ప్రయోగించడం అసహేతుకం, అన్యాయం.

పార్వతీపురం, అనంతపురం కలెక్టరేట్ల వద్ద అంగన్‌వాడీలు నల్ల రిబ్బన్ కట్టుకొని మోకాళ్లపై నిలబడటం, గోరంట్లలో కళ్లకు గంతలు కట్టుకోవడం, కర్నూలులో సీఎం దిష్టిబొమ్మను శవంలా చిత్రీకరించి, మంచంపై వేసి శవజాగరణ చేసి, పాడెకట్టి బోరున విలపిస్తూ, శవయాత్ర చేయడం, సాలూరులో మెడకు చీరకొంగులు బిగించుకొని ప్రజాప్రతినిధులను నిలదీయడం, పాలకొండలో కోలాటం ప్రదర్శన, కడపజిల్లా ప్రొద్దుటూరులో ఒంటికాలిపై ఆసనం, పోరుమామిళ్లలో ప్రజలకు జగన్ నామాలు పెట్టాడంటూ గోవిందనామాలు పెట్టడం, కొండాపురంలో చేతుల్లో వేపమండలతో ఆందోళన, రాయచోటిలో జగన్‌కు ఓటేసినందుకు పశ్చాత్తాపపడుతూ గుంజీలు తీయడం, మదనపల్లె, లక్కిరెడ్డిపల్లెలో నల్లబెలూన్ల ప్రదర్శన, వెంకటగిరిలో వైసీపీ బస్సుయాత్ర ఘెరావ్, బైఠాయింపు, సత్యవేడులో నోటీసు ప్రతుల దగ్ధం, గూడూరులో గొబ్బెమ్మలతో ఆట, ఇతర ప్రాంతాల్లో పొర్లుదండాలు, వంటావార్పు వంటి వినూత్న నిరసనలతో ప్రభుత్వానికి గట్టి సందేశమిచ్చారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీయిచ్చి మోసం చేసినందుకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెకు రంగం సిద్ధం చేస్తుండగా, 5 వేలు వేతనమిచ్చి వెట్టిచాకిరీ చేయించుకుంటున్న గ్రామ, వార్డు వలంటీర్ల ఆగ్రహంతో ఊగిపోతున్నారు. వారి ఆవేదన నివురుగప్పిన నిప్పులా ఉంది. అది ఏ క్షణంలో పెల్లుబికినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఉపాధి కూలీలకు ఏటా 22 కోట్ల పనిదినాలు కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది షెర్ప్ ఉద్యోగుల తరహాలో 23% పీఆర్‌సీ అమలు చేయాలని కోరుతూ ధర్నాలకు దిగారు. ఇలా రాష్ట్రమంతా అగ్నిగుండమై రగులుతోంది. అయినా కదలికలేని ప్రభుత్వం తన పరిపాలనా బాధ్యతలను పూర్తిగా వదిలేసినట్లు తెలుస్తోంది. అందుకే... ఆంధ్రప్రదేశ్‌ను పాలించడానికి అర్జంటుగా ఓ సర్కారు కావలెను!

రైతు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం వీరోచిత పోరు

కె.వి.వి. ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర 18వ మహాసభలు ఈ నెల 8-10 తేదీలలో తూర్పు గోదావరిజిల్లా రాజమహేంద్ర వరంలో జరుగుతున్నాయి. మహాసభల నిర్వహ ణకు ఆహ్వాన సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని రైతుసంఘ నాయకత్వం, కార్యకర్తలు ఆయా జిల్లాల్లో రైతాంగాన్ని కలిసి మహాసభల ప్రాధాన్యతను వివరిస్తూ సంఘంలో సభ్యులుగా చేర్చి సంఘ ఆవశ్యకతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను వివరిస్తూ చైతన్యపరుస్తూ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా మహాసభలు పూర్తిచేసి పటిష్టవంతమైన సంఘ నిర్మాణానికి కృషి చేశారు. 22 జిల్లాలో మహాసభలు జరిగాయి. రాష్ట్ర మహాసభల వేదికైన రాజమహేంద్రవరానికి రైతుప్రతినిధులు తరలివచ్చేందుకు అత్యంత ఉత్సాహంతో సిద్ధమయ్యారు. రైతాంగ సమస్యలపైన, పాలకవర్గాలతీరు, నూతన వ్యవసాయ పద్ధతులు, సాగునీటిరంగ ప్రాజెక్టుల పూర్తిపట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, నూతన వంగడాల ఆవశ్యకత, రైతాంగానికి అవసరమైన రుణాలు, పంటల బీమా ఆవశ్యకత, అప్పుల్లో ఉన్న రైతాంగానికి రుణమాఫీ కల్పించాల్సిన అవసరం, ప్రకృతి వైపరీత్యాలలో నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం పెంపు, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల కల్తీ నిరోధానికి ప్రత్యక్ష చట్టం, కౌలు రైతుల, దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతుల రక్షణ కొరకు చట్టాల్లో మార్పులు, ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సహజ సిద్ధమైన వ్యవసాయం పాడి- పంటలతో వివిధ అనుబంధరంగాల వృద్ధి, వ్యవసాయ అధారిత పరిశ్రమల ఏర్పాటు, నూతన వ్యవసాయ పద్ధతులు, భారతదేశ వ్యవసాయానికి అనుగుణంగా చిన్న కమతాలలో ఉపయోగపడే యాంత్రీకరణ పరికరాలు, శీతల గిడ్డంగులు, గోడౌన్లు, ప్లాట్‌ఫారాల నిర్మాణం, భూగర్భ జలమట్టం పెంచే చర్యలు, చెట్ల పెంపకం, సాగు- మురుగునీటి కాల్వల మరమ్మతులు సహకారరంగ పటిష్టత, రైతాంగానికి ప్రతినిత్యం ఎదురయ్యే రెవెన్యూ సమస్యలు, భూ రక్షణ చట్టంలో లోపాలు తదితర అంశాలను ఆయా మహాసభల్లో చర్చించి తీర్మానించారు.

రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరై రాష్ట్ర మహాసభల్లో మరింతగా చర్చించాలని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోను, జాతీయ స్థాయిలోని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాల్సిన అంశాలపై వివిధ రైతు, ప్రజాసంఘాల ఉమ్మడి కార్యాచరణ రైతుసంఘ పటిష్టత, దేశవ్యాపితంగా జరిగిన రైతాంగ ఉద్యమాలు, వ్యవసాయ రంగంపై కార్పొరేట్ల ప్రభావం, నిర్వాసితుల సమస్యలు, గిరిజ ప్రాంత రైతాంగ సమస్యలు, చిన్న, సన్నకారు రైతులను వ్యవసాయంలో నిలపాల్సిన ఆవశ్యకత, వ్యవసాయంలో యువకులు, మహిళల పాత్ర తదితర అంశాలన్ని రైతుసంఘ నాయకత్వం రాష్ట్ర మహాసభలో చర్చించాలని యోచిస్తున్నది. రైతులను సంఘంలో చేర్చి పటిష్ట రైతుసంఘాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతవైపు మహాసభలో చర్చ జరగాల్సి ఉంది. మొదటి దశాబ్దంలో రైతుసంఘాల నిర్మాణం కృష్ణాజిల్లాలోని అనేక గ్రామాలలో జరిగింది. 1905లో గుడివాడ తాలూకా రైతుసంఘ మహాసభ నిర్మాణానికి జైళ్లే వేదికలుగా నిలవడమే తార్కాణం. అనంతరం తాలూకా సంఘాలు ఏర్పడ్డాయి. 1915లో రైతు సంఘం కృష్ణాజిల్లా నిర్మాణం ఏర్పడింది. ప్రతి సంవత్సరం క్రమబద్ధంగా రైతు మహాసభలు జరిగేవి. 1919లో కృష్ణాజిల్లా రైతు సాంవత్సరిక మహాసభ విజయవాడ శ్రీ రామమోహన గ్రంధాలయంలో జరిగింది. 1919 మార్చి 31న మహాత్మాగాంధి విజయవాడ వచ్చిన సందర్భంగా

రైతుసంఘ నాయకత్వం ఆయనకు సన్మాన పత్రాన్ని సమర్పించి రైతాంగ సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమం పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రకటించారు. రైతుసంఘాల ఏర్పాటు ప్రక్రియ కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు తూర్పు, పశ్చిమజిల్లాలకు విస్తరించింది. 1919-1922 మధ్యకాలంలో విద్యావంతులైన మేధావులు, మధ్యతరగతి రైతులు చైతన్యవంతులై అనేక రాష్ట్రాలలో రైతుసంఘాల ఏర్పాటుకు నాందీ ప్రస్తావికులైనారు. 1894లో కృష్ణా, గోదావరి డెల్టాలలో నీటి తీరువా పెంపుపై జరిగిన ఉద్యమంతో సంఘాల ఏర్పాటుకు బీజం పడింది. కృష్ణాజిల్లాలోని జమీలలో భూమిశిస్తు పెంపు, అక్రమ వసూళ్లకు వ్యతిరేకంగా ఆందోళనలు తీవ్రమయ్యాయి. కొంత మంది కాంగ్రెస్‌వాదులు రైతుసంఘాల ఏర్పాటుపై ప్రతిఘటన ప్రదర్శించారు. ఈ దశలో మాగంటి బాపినీడు నాయకత్వాన రైతుసంఘాల అవసరాన్ని వివరిస్తూ కరపత్రాలు రాసి పంపిణీ చేశారు. 1928లో గుంటూరులో రాష్ట్ర రైతు సంఘ ప్రథమ మహాసభ జరిగింది. బిక్కిని వెంకటరత్నం చౌదరి అధ్యక్షులుగా, ఎన్‌జీ రంగా, మాగుంట బాపినీడు, నర్సింహాదేవర సత్యనారాయణ కార్యదర్శులుగా ఎన్నికైనారు. 1929లో రెండవ మహాసభ విజయవాడలో జరిగింది. అధ్యక్షులుగా ఎన్జీ రంగా ఎన్నికయ్యారు. 1930,31లలో శాసనోల్లంఘన ఉద్యమాలు ఊపందుకున్నాయి. అనేక మంది రైతురంగంలో పనిచేసే నాయకులు జైళ్లపాలయ్యారు. 1931లో బాపట్లలో మూడవ మహాసభ జరిగింది. అధ్యక్షులుగా వేమవరపు రామదాసు పంతులు, ప్రధాన కార్యదర్శిగా ఎన్జీరంగా, 4వ మహాసభ 1934 డిసెంబరులో విశాఖపట్నంలో జరిగింది. అధ్యక్షులుగా ఎన్జీ రంగా, ప్రధాన కార్యదర్శిగా : కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. కొందరు కాంగ్రెస్ వాదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టు శ్రేణులు కలిసి రైతుసంఘాన్ని స్వతంత్రంగా నడపాలనే నిశ్చయంతో గ్రామస్థాయి నుంచి రైతుసంఘాన్ని నిర్మించారు. 5వ మహాసభ 1936లో నిడుబ్రోలులో జరిగింది. ఆదే సంవత్సరం ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం సమోదైంది. 6వ మహాసభ 1937 జూన్‌లో నిడుబ్రోలు జరిగింది. అధ్యక్షులుగా కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా చలసాని వాసుదేవరావు ఎన్నికయ్యారు. సామాన్య, పేద రైతుల అప్పులు రద్దుచేసి మారిటోరియం ప్రకటించాలని, జమీందారీ విధానం రద్దు, శిస్తు బకాయల రద్దు, శిస్తు తగ్గింపు అంశాలపై సంఘం తీర్మానించింది. మద్రాస్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పై అంశాలను తమ ఎన్నికల ప్రణాళికలో చేర్చి అమలు చేయకపోవడంపై ఈ రైతు రక్షణ యాత్ర రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ పాదయాత్ర ఉద్యమ ప్రభావంతో 1937 సెప్టెంబరులో ప్రకాశం పంతులు అధ్యక్షతన ఎస్టేట్ ల్యాండ్ యాక్ట్ కమిటీ ఏర్పాటు, 1938లో వ్యవసాయ రుణ విమోచన చట్టం చేశారు. 1936లో అఖిల భారత కిసాన్‌సభ ఏర్పాటు ఆంధ్రరాష్ట్ర రైతు ఉద్యమానికి ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని ఇచ్చింది. దేశ స్వాతంత్ర్య పోరాట పంథా రైతాంగ ఉద్యమాలు నడపడంపై ఏర్పడ్డ విభేదాలతో ఎన్జీ రంగా, వారి అనుయాయులు ఏఐకేఎస్ నుంచి వేరయ్యారు. 1942 నవంబరు 7న రైతాంగానికి సంఘాలు అవసరంలేదని ప్రకటించడం విచారకరం. ఈ దశలో చలసాని వాసుదేవరావు ఆర్గనైజర్‌గా ఆంధ్రరాష్ట్ర రైతుసంఘాన్ని పునరుద్ధరించారు. 1944 మార్చి 14, 15 తేదీలలో విజయవాడలో జరిగిన ఏఐకేఎస్ జాతీయ మహాసభ చరిత్రాత్మకంగా నిలిచింది. యుద్ధకాలంలో బ్లాక్‌మార్కెట్‌తో రైతాంగాన్ని వ్యాపారుల దోపిడీ నుంచి కాపాడింది మన సంఘం. బండి పట్టాల నుంచి కిరోసిన్ వరకు ప్రజలకు, రైతాంగానికి కంట్రోల్ రేటుకు ఇప్పించడంలో మన సంఘ నాయకత్వం ఆపద్బాంధవులుగా నిలిచింది. బందరు కాలువ పూడిక తీయటంతో అమరులు చంద్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్య, అనేకమంది రైతు నాయకులు ప్రజాసేవలో పునీతం అయ్యారు. 1951 అక్టోబరులో విజయవాడలో సంఘ పునర్నిర్మాణ సమావేశం జరిగి నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కడియాల గోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా వైవీ కృష్ణారావు ఎన్నికయ్యారు. 8వ మహాసభ 1953లో పెదవడ్లపూడిలో జరిగింది. విలీన మహాసభ: 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ జరిగింది. నవంబరులో హైదరాబాదులో ఆంధ్ర, తెలంగాణ రైతు సంఘాల విలీన సమావేశం నిర్వహించారు. అధ్యక్షులుగా ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వైవీ కృష్ణారావు ఎన్నికయ్యారు. 1964లో కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన చీలిక ప్రభావంతో రైతుసంఘంలో కూడా చీలిక ఏర్పడింది. అప్పటి నుంచి రైతుసంఘంలో బద్దం ఎల్లారెడ్డి, వైవీకృష్ణారావు, ఆరుట్ల రామచంద్రారెడ్డి, సీహెచ్ రాజేశ్వరరావు, ఆల్లూరి వెంకటరామరాజు, వల్లూరి గంగాధరరావు, కొల్లి నాగేశ్వరరావు, టీవీ చౌదరి, కె. రామకృష్ణ, రావుల వెంకయ్య, పల్లా వెంకటరెడ్డి, పశ్యపద్మ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘానికి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పని చేశారు. 1974ఏప్రిల్‌లో ఖమ్మంలో జరిగిన మహాసభలో రైతుసంఘ చిహ్నంగా ఎర్ర జెండాపై నాగలి గుర్తు ముద్రించాలని నిర్ణయించారు. 1994 నుంచి రైతన్న డెయిరీ ప్రచురణ కొనసాగుతున్నది. 2014 జూన్ 13న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రైతు సంఘాలుగా విభజించారు. అధ్యక్షులుగా పి. రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా రావుల వెంకయ్య ఎన్నికయ్యారు. వ్యవసాయ, ఉద్యాన, మృత్స, పాడి రంగాలలో పనిచేస్తున్న 6300మంది యం.పి.ఈ.ఒ. లకు ఉద్యోగ భద్రత కోసం ఆందోళన నిర్వహించి విజయం సాధించడంలో రైతుసంఘం ప్రధాన భూమిక నిర్వహించింది. ఈ సంఘానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మాజీఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి సలహాదారులుగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తెచ్చిన మూడు వ్యవసాయ నల్లచట్టాల రద్దుకోసం దేశ వ్యాప్తంగా జరిగిన మహోద్యమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రముఖపాత్ర వహించింది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానవన పంటలకు డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందించకుండా రైతాంగాన్ని ఇబ్బంది పెడుతున్న తరుణంలో మన సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించి రైతాంగానికి ఊరట కలిగించింది. రాజమండ్రి వేదికగా జనవరి 8,9,10 తేదీలలో జరిగే రాష్ట్ర మహాసభలలో రైతాంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్‌లో సమరశంఖం పూరించేందుకు సన్నద్ధం కావాలి.

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ప్రధాన కార్యదర్శి
ఫోన్: 490952737

శుభోదయం లేని గాజా!

"గాజాలో ఉదయం సమయంలో ఎలా ఉంటుందో చెప్పాలనుకుంటు న్నాను. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో ఉదయం కంటే ఇక్కడి ఉదయం విభిన్నంగా ఉంటుంది." -మరియం అబూ దఖ్ఖా (ప్రెస్ ఫోటో గ్రాఫర్)

"గాజాలో ఉదయం అమరవీరులకు వీడ్కోలు వందనాలతో ప్రారంభమౌతుంది. పౌరుల ఇళ్లపై యుద్ధ విమానాల దాడులు ప్రతి ఒక్కరి ముఖంలో విషాదం గూడు కట్టుకుంది. ఆకలి, అలసట వారి మిత్రులై పోయాయి. "అక్టోబరు 7నుండి ఇప్పటివరకు వేదనాభరిత కాలమే. ప్రతిరోజూ ప్రారంభమౌతుంది దాడులతో, అమరులకు వీడ్కోలుతో, విషాదంతో, గాయాలతో, భయంతో" ప్రజలు ఒకరికొకరు 'శుభోదయం' చెప్పడం మానేశారు. వాళ్ల ఇంటిపైనా, తలలపైనా పడుతున్న బాంబుల నుంచి తప్పించుకున్నందుకు దేవుడికి ధన్యవాదాలు చెబుతున్నారు. "గాజా పరిస్థితి ఏమీ బాగాలేదు. తొంభై రోజులుగా ప్రజలు నిద్ర నుండి భయభ్రాంతులై లేస్తున్నారు. రాత్రంతా గడిపి ఉదయాన్నే లేచి ఇంకా బతికే ఉన్నందుకు దేవుడికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. కాని ఇప్పుడున్న బాంబుల వర్షం, శిధిలాలు, విధ్వంసం మధ్య నిజంగా వారు బ్రతికి ఉన్నట్లే కాదు. ఒకరోజు గడిస్తే, రెండోరోజు ఏమౌతుందోనంటూ బతుకుతున్నారు. క్షణక్షణమూ, గంటగంటకూ, రోజురోజూ భయంతో బతుకుతున్నారు. "ప్రపంచంలో ఇతర దేశాలలో ఉదయ సమయం అంటే పనికి పోవడానికి తయారుకావడం, కాఫీ తాగే సమయం, బంధువులను చూసే సమయం, ఒకరినొకరు పలకరించుకునే సమయం, బీచ్‌లో కాలం గడిపే సమయం ఒక సాధారణమైన జీవితం గడిపే సమయం- కాని గాజాలో అలా కాదు" ఇది నరమేధం. ఇజ్రాయిలీ సైన్యం గాజాను ధ్వంసం చేసింది. 80 వేల టన్నుల శక్తిగల ఉల్కలు వందలాదిగా నగరాల్లో, పట్టణాలపై, గ్రామాలపై శరణార్థి శిబిరాలపై పడినట్లు గాజాకు ఉత్తరం నుండి దక్షిణ ప్రాంతం వరకు శిధిలాలైన చెత్తా చెదారంగా మిగిలిన ఆవాసాలు కనబడుతున్నాయి. ఇది నిస్సహాయులపై జరుపుతున్న నరమేధం. కాని, దీనికి ప్రజలేమీ పశ్చాత్తాపపడటంలేదు. ఇళ్లు కూలి పోయినా మేముండే చోటులోనే మేము కొనసాగుతామంటున్నారు. ఇప్పటికే విలక్షణా రహితంగా 21 వేలమంది ప్రజలను హతమార్చారు. వారి వారి కూలిన ఇళ్ల క్రింద 7000 మంది మరణించగా, 65వేల మంది గాయపడ్డారు. ఈ మూడునెలల కాలంలో ఇజ్రేక్106 మంది పాత్రికేయులను చంపింది. గాజాలో జరుగుతున్న కసాయికాండ ప్రపంచానికి తెలియకుండా చేయడానికి...కాని ప్రపంచవ్యాప్తంగా ఇజ్రా యిల్ హేయమైన చర్యలు అందరికీ తెలుసు. ప్రపంచమంతా ఇజ్రేక్ వైపు వేలెత్తి చూపిస్తోంది.

అనువాదం: కొత్తపల్లి రవిబాబు
ఫోన్: 94401 96890

లోకాయుక్త కార్యాలయాన్ని విజయవాడకు మార్చాలి

పిల్లి ఈనిన తరువాత తనపిల్లలను ఏడు చోట్లకు మారుస్తందట అలావుంది లోకాయుక్తపరిస్థితి. రాష్ట్రం ఏర్పడిన తరువాత చాలా రోజులు హైదరాబాద్‌లోనే ఉంది. విజయవాడ మారుస్తామని విజయవాడ బందరు రోడ్డులో ఒక కార్యాలయాన్ని తయారుచేస్తున్నామని, ఒకరోజు అక్కడ కోర్టు పెట్టి సాయంత్రానికి మరల హైదరాబాద్ మార్చారు. తరువాత కర్నూలుకి మార్చారు.ముఖ్యమైన కార్యాలయాలు అమరావతిలోఉంటే రాష్ట్ర ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. శ్రీకాకుళం, విశాఖ వారు కర్నూలు రావాలంటే రెండురోజుల ముందుగా ప్రయాణం పెట్టుకోవాలి. కర్నూలుకు నేరుగా రైలు లేదు. ఇబ్బందులుపడుతూ రావాలి. పక్క జిల్లా ప్రకాశం జిల్లా వారు రావాలన్నా నల్లమల అడవులు దాటుకుంటూ ఒక రాత్రల్లా నిద్దరలేకుండా ప్రయాణం చెయ్యాలి. అందులో కర్నూలులో పెట్టిన కార్యాలయం కూడా నెలకు ఆరులక్షలు అద్దె భవనంలో పెట్టారు. ఎవరికోసం? అదే విజయవాడ, అమరావతిలో ప్రభుత్వ భవనాలు ఎన్నో ఖాళీగా ఉన్నాయి. మంగళగిరిలో కూడా చాలా కార్యాలయాలు అద్దె భవనాలలో ఉన్నాయి. వాటిని అమరావతికి మారిస్తే ముందు రాష్ట్ర ప్రజలకు అనుకూలంగా ఉంటుంది, రెండోది కొట్లాది రూపాయలు అద్దె చెల్లింపులు తగ్గి, ప్రభుత్వానికి ఆర్థిక భారం కూడా తగ్గుతుంది.

నార్నె వెంకటసుబ్బయ్య
ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు

ఆరో తరగతి చదివిన అహంకారి రాజు కథ

డాక్టర్ దేవరాజు మహారాజు

దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక భారీ బహిరంగ సభ లో హిందీలో చెప్పిన కథ - చెప్పింది చెప్పినట్లుగా నా తెలుగు పాఠకులకు అందిస్తున్నాను. అది ఇలా సాగుతుంది-

"ఎవడో రాజు గారికి చెప్పాడు. దేశంలోని నోట్లు రద్దు చెయ్. దేశంలో లంచగొండితనం, తీవ్రవాదం లేకుండా పోతాయ్ అని. అంతే, ఓ రోజు సాయంత్రం రాజుగారు టి.విలోకి వచ్చి నోట్లు రద్దు చేస్తున్నానని ప్రకటించాడు. ఏమయ్యిందీ? బ్యాంకుల ముందు పెద్ద పెద్ద క్యూలు కనిపించాయి. క్యూలలో ఎంతో మంది చచ్చిపోయారు. చిన్నా, చితక వ్యాపారాలన్నీ మూలపడ్డాయి. వారికి ఏ ఆధారమూ లేకుండా పోయింది. మరొకనాడు ఒకడెవరో వచ్చి రెండువేల నోట్లు తీసుకురా అని చెప్పాడు. అంతే, రాజు గారు తీసుకొచ్చారు. నాలుగేళ్ళ తర్వాత కొందరెవరో రెండు వేల నోట్లు రద్దు చేయమని అడిగారు. రాజుగారు అలాగే చేశారు. రాజు గారికి తెలివి లేదు. చదువు లేదు. ఎవడో వచ్చి చెప్పాడు. రైతుల బతుకులు తెల్లగా చేయడానికి నల్ల చట్టాలు తెమ్మని. అవివేకపు రాజుకు ఆలోచించే శక్తి లేదు. రైతు వ్యతిరేక చట్టాలు అమలు చేశాడు. దేశంలోని రైతులందరూ రోడ్ల మీదికి వచ్చారు. ఆందోళనలు చేశారు. బుద్ధి హీనుడైన రాజు నిర్లక్ష్యంతో 750 మంది రైతులు మరణించారు. ఒక సంవత్సరం తర్వాత రాజు తన మూర్ఖత్వం పక్కన పెట్టి, విధిలేక రైతు చట్టాలు రద్దు చేయవలసి వచ్చింది.

రాజు తన మిత్రులను బాగా చూసుకునేవాడు. రాజు స్నేహితుడొకడు పదివేల కోట్లు దొంగతనం చేశాడు. రాజు అతణ్ణి విదేశాలకు పంపి రక్షించుకున్నాడు. రాజుగారి మరొక మిత్రుడు ముప్పయి వేల కోట్లు లూటీ చేస్తే - రాజుగారు అతణ్ణి కూడా పారిపొమ్మని సైగచేసి రక్షణ కూడా కల్పించాడు. రాజుగారికి మరొక ప్రియ మిత్రుడున్నాడు. అతనికి మాత్రం రాజుగారు మొత్తం విమానాశ్రయాలు అమ్మేశాడు. నౌకలు, పోర్టులూ అమ్మేశాడు. దేశపు కోశాగారమే అతనికి అమ్మేశాడు. ఎనలేని సౌకర్యాలు, వసతులు కల్పించి, స్నేహంలో తనకు ఉన్న నిజాయితీని ప్రదర్శించాడు. రాజుగారికి మరో ప్రియమైన ఫ్రెండున్నాడు. అతను అంతర్జాతీయ క్రీడారంగంలో ఎన్నో మెడల్స్ గెల్చుకుని వచ్చిన, మహిళా క్రీడాకారులతో అసభ్యంగా ప్రవర్తించాడు. అతణ్ణి రాజు చట్టానికి అప్పగించాల్సింది కానీ, అలా చేయకుండా స్నేహధర్మం పాటించాడు. మహిళల్ని అవమాన పరిచిన మిత్రుడి గూర్చి ఒక్క మాట మాట్లాడలేదు.

ఆరో తరగతి చదివిన అహంకారి రాజు కథ ఇది! ఈ కథలో రాజు మాత్రమే ఉన్నాడు. రాణి గారు లేరు. ఎందుకు లేరన్నది బహిరంగ రహస్యం.. ఈ సువిశాల దేశంలోని ఒక మారుమూల గ్రామంలో ఓ రోజు ఓ పిల్లవాడు పుట్టాడు. జ్యోతిష్యుడొకడు చెప్పాడు తమ్మిని బమ్మి చేసి ఎలాగైనా వీడు చాలా పెద్దవాడై పోతాడని! క్రమంగా పిల్లవాడు పెరుగుతున్నాడే గానీ, వాడికి చదువు మీద ధ్యాస ఉండేది కాదు. బడికి సరిగా వెళ్ళేవాడు కాదు. ఆరో తరగతిలో ఉండగా పాఠశాల రిజిస్టర్లో అతని పేరు కొట్టేశారు. అయితే ఊరికి కూత వేటు దూరంలో ఒక రైల్వే స్టేషన్ ఉండేది. ఈ పిల్లవాడు ఆ స్టేషన్‌లో చాయ్ అమ్ముతుండేవాడు. ఎలాగైతేనేం ఆ పిల్లవాడు ఆ దేశానికి సమ్రాట్ అయిపోయాడు. కానీ ఏం లాభం? రాజుగారికి చదువులేదు. తెలివిలేదు. అయినా కింది అధికారులను ఏదీ అడిగే వాడు కాదు. అడిగితే తన అజ్ఞానం బయట పడుతుందేమోనని భయం! అందుకే వాళ్ళు ఏ ఫైలు తెచ్చినా కళ్ళుమూసుకుని సంతకం చేసేవాడు. రాజు చదువుకోలేదన్న విషయం మెల్ల మెల్లగా దేశమంతా తెలిసిపోయింది. రాజుగారు నొచ్చుకున్నారు. వెంటనే ఓ యం.ఎ. డిగ్రీ సృష్టించుకున్నారు. యం.ఎ. డిగ్రీ అబద్ధపుదని ఎవరికీ తెలియగూడదనుకున్నాడు. దాన్ని ఒక రహస్య విషయం చేసేశాడు. భార్యను తన్ని తగలేసిన ఘనకార్యంకూడా ఎవరికీ తెలియగూడదనుకుని రహస్యంగా ఉంచాడు. పదవితో అహంకారం వచ్చిందే కానీ, మెదడు ఖాళీ అని దేశ ప్రజలకు తెలిసిపోయింది. ఒకసారి దేశంలో ఒక మహమ్మారి ప్రవేశించింది. ఫలితంగా జనం ఎక్కడికక్కడ చచ్చిపోతున్నారు. ఒకడెవడో వచ్చి సాయంత్రం వేళ చప్పట్లు చరిపించమని, ప్లేట్లు మోగించమని సలహా ఇచ్చాడు. అద్భుతమైన తన పరిపాలనకు దేశ ప్రజలు హర్షించి ఎలాగూ చప్పట్లు కొట్టరు. కానీ, ఏదో వంకతో చప్పట్లు కొట్టించుకోవాలని ఒక పథకం ప్రకారం, రాజుగారు టి.విలో కనపడి దేశ ప్రజలకు దిశా నిర్దేశం చేశారు. రాజుగారి మరో మిత్రుడు రైతుల మీదికి కారు నడిపించాడు. వారిని నుగ్గు నుగ్గు చేశారు. అయినా, రాజుగారు స్నేహ ధర్మానికి కట్టుబడి ఉన్నారు. శిక్షించాల్సిన స్నేహితుణ్ణి రక్షించుకున్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాల గూర్చి రాసిన రచయితలను, జర్నలిస్టులను, హేతువాదులను వెతికి వెతికి పట్టుకుని చూపించాడు. లేదా జైళ్ళలో వేశాడు. రాజు గారికి లేదా ఆయన సహచరులకు వ్యతిరేకంగా తీర్పులు చెప్పిన జడ్జిల్ని చంపించేవాడు. లేదా, రాజ్యసభ సీటిచ్చి నోరు మూయించేవాడు. ఓ రోజు భోరున వర్షం కురిసింది. ప్రకృతి విలయ తాండవం చేసింది. అందులో ఆకాశవాణి పలికింది - ఇంత గొప్ప దేశంలో ఉన్న ప్రజలారా! ఎందుకు ఉపేక్షిస్తున్నారూ? మీరంతా వివేకవంతులు. అందరూ ఏకం కండి! గొంతెత్తి పలకండి. అహంకారి రాజును దింపేయండి! - అని అంది. అంతే!! ప్రజలు మేల్కొన్నారు. తిరగబడ్డారు. ఐకమత్యంతో రాజును ఎదిరించారు. రాజు దిగిపోయాడు. గడ్డురోజులు పోయాయి. ప్రగతి శీఘ్రగతిన సాధించుకున్నారు. ఉత్తుత్తి 'అచ్ఛేదిన్' కాదు, నిజంగానే మంచి రోజులొచ్చాయి!

భారత ప్రధాని ఇటీవలి అమెరికా పర్యటనను నిరసిస్తూ వాషింగ్టన్ డి.సి రోడ్ల మీద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. అందులో అమెరికా అధ్యక్ష భవనం సమీపంలో జరిగిన ఒక నిరసన కార్యక్రమంలో భారత జర్నలిస్ట్ నిరంజన్ టక్లే ఇంగ్లీషు ఉపన్యాసానికి మార్పులు, చేర్పులూ లేని తెలుగు అనువాదం నా పాఠకులకోసం! ఆ ఉపన్యాసం ఇలాసాగింది. నేను ఇండియాలో ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ గా 25 ఏళ్ళకు పైగా పనిచేశాను. నా చివరి ఇన్వెస్టిగేషన్ రిపోర్టు ఒక జడ్జి - జస్టిస్ లోహియాను ఎలా హత్య చేశారు? - అనేది. అదేనా పరిశోధనాత్మక రిపోర్టు. ఆ విషయం ఎందుకు చెపుతున్నానంటే, ఇండియాలో జర్నలిస్టుల పరిస్థితి, జర్నలిజం పరిస్థితి ఎంతదయనీయంగా ఉందో మీరు అర్థం చేసుకుంటారనీ! అది 2017లో ఇండియాలో అతిపెద్ద సంచలనాత్మకమైన కథనం! నేను ఇప్పుడు ఈ సమావేశానికి ఎందుకొచ్చానంటే-అమెరికా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని, మానవ హక్కుల్ని పరిరక్షిస్తుందని, ప్రెస్ కు, మీడియాకు పూర్తి స్వేచ్ఛ నిస్తుందనీ విన్నాను. మరి వీటన్నిటినీ తొక్కిపెట్టి దుర్మార్గ పాలనను అందిస్తున్న భారత ప్రధానికి అమెరికా ప్రభుత్వం ఎందుకు స్వాగతం పలుకుతోందో మీ అందరికీ అర్థం కానట్టే, నాకూ అర్థం కావడం లేదు. 2002లో గుజరాత్‌లో జరిగిన మారణకాండకు కారకుడు నరేంద్రమోది. అప్పుడేకాదు, ఇప్పుడు కూడా ఒకటిన్నర నెలలుగా మణిపూర్‌లో మానవ హననం జరుగుతోంది.జాతులమధ్య విద్వేషాలు చెలరేగిపోయి మనుషులు హత్య చేయబడుతున్నారు. ఓ సినీనటికి జలుబుచేస్తే దేశ ప్రధాని ట్వీట్ ద్వారా తన బాధ వ్యక్తం చేస్తాడు. కానీ, మారణహోమాలకు స్పందించడు. విచిత్రం? నేనొక జర్నలిస్ట్‌ని నిజాల్ని జనం ముందుంచడం నా నైజం ! దోషిని ఎత్తి చూపడం నా నైజం!! దోషి తల దించుకునేట్లు చేయడమే నా ప్రవృత్తి. ఇదికాదు ప్రజాస్వామ్యం. నా పూర్వీకులు పోరాటాలు చేసి సాధించుకున్న దేశ స్వాతంత్ర్యం అభాసుపాలవుతోంది. ఇదిగో చూడండి. జడ్జి హత్య గురించి నేను రాసిన పుస్తకం ఇదే. ఔను KILLED JUDGE NIRANJAN TAKLE- ఇప్పుడు కేంద్ర హోం మంత్రిగా ఉన్న అమిత్ షా ఒక నేరస్థుడు - అని తీర్పు చెప్పిన సిబి స్పెషల్ కోర్టు జడ్జిని నిర్దాక్షిణ్యంగా అమిత్‌షా చంపించాడని అభియోగం వచ్చింది. ఆ తరువాత 15 రోజులకు వచ్చిన కొత్త జడ్జి తీర్పుకు సంబంధించిన ఒక్క పేపరు కూడా చూడకుండా అమిత్ షా నిర్దోషి అని తీర్పు ఇచ్చాడు. సత్యాన్ని, న్యాయాన్ని పరిరక్షించే పద్ధతి ఇదేనా?

సుప్రసిద్ధ సాహితీ వేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

ద్వారకలో శ్రీకృష్ణుడికి సీజేఐ పూజలు

ద్వారక: శ్రీకృష్ణుడు కొలువైన ద్వారక ను భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ శనివారం దర్శించుకున్నారు. ద్వారకాధీశుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పసుపు రంగు దుస్తులు ధరించి సతీసమేతంగా ఆయన కృష్ణుడిని దర్శించుకున్నారు. సీజేఐ రాక సందర్భంగా ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా కలెక్టర్ అశోక్ శర్మ, ఎస్పీ నితీశ్ పాండే తదితరులు ఆలయం వద్ద సీజేఐకి స్వాగతం పలికారు. ఉదయమే ఆలయానికి చేరుకున్న సీజేఐ గోపురంపై జెండా ఆవిష్కరించారు. షెడ్యూల్ ప్రకారం సోమ్‌నాథ్ ఆలయంలో పూజలు చేసేందుకు రాజ్‌కోట్ నుంచి సీజేఐ బయలుదేరినప్పటికీ కారణాంతరాల వల్ల హెలికాప్టర్ అక్కడ ల్యాండ్ కాలేదు. దాంతో ఆయన షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. జామ్‌నగర్, దేవభూమి ద్వారక జిల్లాల అధికారులు, జిల్లా జడ్జిలు ఆయన వెంట ఉన్నారు. రాజ్‌కోట్‌లో రూ.110 కోట్లతో కొత్తగా నిర్మించిన కోర్టు భవనాన్ని సీజేఐ ప్రారంభించారు.

పెళ్లికి నిరాకరించినందుకు...

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. బందా జిల్లా కొత్వాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీఎం కాలనీలో ఓ యువతి తన మేనమామ ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. ఆమె మామ కుమారుడు జ్ఞాన్ ప్రకాశ్(26) కూడా ఆమెతో కలిసి ఒకే కాలేజీలో న్యాయశాస్త్రం చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పర్సనల్‌గా మాట్లాడాలంటూ ప్రకాశ్ ఆమెను బయటకు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకోవాలనుకుంటున్నట్లు ఆమెకు తన అభిప్రాయం చెప్పాడు. అయితే, యువతి అతనితో పెళ్లికి నిరాకరించింది. ఈ పెళ్లి తనకు ఇష్టం లేదని తేల్చి చెప్పింది. అప్పటికే పథకం ప్రకారం తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె మెడపై బలంగా నరికాడు, గొంతులో పొడిచాడు. అనంతరం ప్రకాశ్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో యువతి తీవ్రంగా గాయపడింది. తీవ్ర రక్తపు మడుగులో కొట్టిమిట్టాడుతున్న యువతిని స్థానికులు గుర్తించి... ఆస్పత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్ర సముద్రంలో దాడులు... సరకు రవాణా భారం

న్యూఢిల్లీ: ఎర్రసముద్రంలో జరుగుతున్న వరుస దాడులు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. యెమెన్‌కు చెందిన హౌతీలు జరుపుతున్న దాడులు నౌకా రవాణాను దెబ్బతీస్తోంది. భారత వాణిజ్యంపైనా దీని ప్రభావం పడుతోంది. ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడి మూలంగా సరకు రవాణా వ్యయం, బీమా ప్రీమియం పెరగనుందని ఆర్థిక మేధోసంస్థ గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ పేర్కొంది. సరకు రవాణా కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉందని తెలిపింది. మధ్యధరా సముద్రానికి, హిందూ మహాసముద్రానికి మధ్యనున్న ఎర్ర సముద్రంలో బాబ్ ఎల్ మాండెబ్ జలసంధి మీదుగా సరకు రవాణా నౌకలు ప్రయాణం చేస్తుంటాయి. ఈ జల సంధి వద్దే హౌతీలు దాడులు జరుపుతున్నారు. దీంతో ప్రస్తుతం నౌకలు కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. దీంతో సరకు రవాణా 20 రోజులు ఆలస్యమవుతోంది. మధ్యప్రాశ్చం, ఆఫ్రికా, యూరప్ దేశాలతో మన దేశ వాణిజ్యం ప్రధానంగా ఈ మార్గం ద్వారానే జరుగుతోంది. మన దేశానికి వచ్చే ముడిచమురు, ఎల్ఎన్‌జీ దిగుమతుల కోసం భారత్ బాబ్ ఎల్ మాండెబ్ జలసంధిపైనే ఆధారపడుతోంది. యూరప్, ఆఫ్రికాతో జరిగే వాణిజ్యంలో 50 శాతం దిగుమతులు, 60 శాతం ఎగుమతుల కోసం ఈ మార్గమే ఆధారం. మొత్తం 113 బిలియన్ డాలర్ల వర్తకం జరుగుతోంది. హౌతీల దాడుల కారణంగా కేప్ ఆఫ్ గుడ్ హోప్ వంటి ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూడాల్సిన అవసరం ఏర్పడిందని జీటీఆర్ పేర్కొంది. అంతేకాకుండా ముడిచమురు, ఎల్ఎన్‌జీ కోసం ఇతర దేశాలను ఆశ్రయించడంతోపాటు దాడుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలనూ భారత్ పరిశీలించే అవకాశం ఉందని వెల్లడించింది. ఎర్ర సముద్రంలో దాడుల కారణంగా షిప్పింగ్ వ్యయం 40-60 శాతం మేర పెరిగే అవకాశం ఉంది. ఇతర మార్గాల ద్వారా ప్రయాణం వల్ల సరకు రవాణా 20 రోజుల మేర ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఇన్సురెన్స్ ప్రీమియం సైతం 15-20 శాతం పెరుగుతుందని జీటీఆర్ఐ పేర్కొంది.

సోరెన్ మీడియా సలహాదారుడికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: రాష్ట్రంలో అక్రమ మైనింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మీడియా సలహాదారుడు అభిషేక్ ప్రసాద్, సాహిబ్‌గంజ్ డిప్యూటీ కమిషనర్ రామ్ నివాస్ యాదవ్‌లకు ఈడీ సమన్లు పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రసాద్ అలియాస్ పింటూను జనవరి 16న రాంచీ కార్యాలయంలో, జనవరి 11న యాదవ్‌ను, జనవరి 15న మరో వ్యక్తి బినోద్ సింగ్‌ను ఈడీ ప్రశ్నించనున్నది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద వారి వాంగ్మూలాలు నమోదు చేయనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి.

రామమందిరం పేరుతో రాజకీయాలు: బీహార్ మంత్రి

రాంచీ: రామమందిరం పేరుతో దేశంలో రాజకీయాలు జరుగుతున్నాయని బీహార్ మంత్రి అశోక్ చౌదరి శనివారం ఆరోపించారు. ప్రస్తుతం దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం అతిపెద్ద సమస్యలని జార్ఖండ్ జేడీ(యూ) ఇన్‌ఛార్జ్ చౌదరి చెప్పారు. 'కొంతమంది తమ ప్రయోజనాల కోసం రాముడిపై పేటెంట్ పొందాలనుకుంటున్నారు. రాముడి గుడి కట్టడం మంచిదే కానీ... దానిపై రాజకీయాలు చేయడం మంచిది కాదని మంత్రి చౌదరి అన్నారు

మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రుకు బెయిల్

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో అక్రమాలకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రుడికి ఢిల్లీ కోర్టు రెండు వారాల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. మద్యం పంపిణీదారు మహేంద్రు తన భార్య ఆరోగ్య సమస్యల కారణంగా బెయిల్ ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్ విచారణ జరిపారు. ఏ సాక్షిని ప్రభావితం చేయరాదని, సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నించవద్దని షరతు విధిస్తూ బెయిల్ మంజూరు చేశారు.

గుజరాత్ స్టీల్ పరిశ్రమలపె చైనా దిగుమతుల ప్రభావం

ప్రభుత్వాన్ని నిందించిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : గుజరాత్‌లోని స్టెయిన్‌లెస్ స్టీల్ రంగంపై చైనా దిగుమతుల ప్రభావం ఉందని, ఫలితంగా 30 నుంచి 35 శాతం ఎంఎస్ఎంఈ పరిశ్రమలు మూతపడ్డాయని కాంగ్రెస్ శనివారం మీడియా నివేదికను ఉదహరించింది. చైనా నుంచి దిగుమతుల 'భారీ వరదే' ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వాన్ని నిందించింది. చౌకైన చైనా దిగుమతుల కారణంగా భారతీయ స్టెయిన్‌లెస్ స్టీల్ వ్యాపారులు భారీ భారాన్ని మోస్తున్నారని, దీనివల్ల గత ఏడాది జులై-సెప్టెంబరు మధ్య గుజరాత్‌లో దాదాపు 30 నుంచి 35 శాతం మేర మధ్యతరహా, చిన్న వ్యాపార పరిశ్రమలు మూతపడ్డాయని ఇండియన్ స్టెయిన్‌లెస్ స్టీల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ (ఐఎస్ఎస్‌డీఏ) అధ్యక్షుడు రాజమణి కృష్ణమూర్తిని ఉటంకిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. 'దేశంలోని స్టెయిన్‌లెస్ స్టీల్ రంగంలో 80 శాతం ఎంఎస్ఎంఈలు గుజరాత్‌లోనే ఉన్నాయి. వీరిలో 35 శాతం మంది జులై-సెప్టెంబరు 2023 మధ్య వాటిని మూసివేశారు. ఇంకా చాలా మంది మనుగడ సాగించలేకపోతున్నారు. కారణం? చైనా నుంచి పెద్దఎత్తున దిగుమతులు ఉన్నాయి. ప్రధాన మంత్రి క్లీన్ చిట్ ఇచ్చిన దేశం. ఇకపై నివేదిక ప్రకారం, ఇకపై ఎవరితోనైనా భారతదేశానికి చౌక దిగుమతులపై మా ఆందోళనను మేము వ్యక్తం చేయము' అని పేర్కొన్నారు.

జమిలి ఎన్నికలపై సూచనలివ్వండి

ప్రజలకు కోవింద్ కమిటీ ఆహ్వానం



న్యూఢిల్లీ: జమిలీ ఎన్నికలపై తమ సలహాలు, సూచనలు ఇవ్వాల్సిందిగా 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై అధ్యయనం కోసం ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీ ప్రజలు, ఉద్యోగులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కోరింది. జమిలి ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఈ కమిటీ చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే ప్రజల నుంచి సలహాలు, సూచనలు ఆహ్వానించింది. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించడం లేక ప్రస్తుతం ఉన్న చట్టపరమైన అడ్మినిస్ట్రేటివ్ ఫ్రేమ్‌వర్క్‌లో తగిన మార్పులు సూచించాలని కోవింద్ కమిటీ ఓ ప్రకటనలో కోరింది. జనవరి 15లోగా ప్రజలు తమ సలహాలు ఇవ్వొచ్చని వెల్లడించింది. ఈ సూచనలను కమిటీ వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలని తెలిపింది. ఒకే దేశం- ఒకే ఎన్నిక కోసం గతేడాది సెప్టెంబరులో ఈ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి రెండుసార్లు సమావేశాలు నిర్వహించింది. ఇటీవల రాజకీయ పార్టీల నుంచి అభిప్రాయాలు కోరింది. జమిలి ఎన్నికలపై న్యాయ కమిషన్ నుంచీ సలహాలు తీసుకుంది.

పోలీసుపై బీజేపీ ఎమ్మెల్యే దాష్టీకం

ముంబై: మహారాష్ట్రలో అధికార బీజేపీ ఎమ్మెల్యే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారిపై దాష్టీకానికి పాల్పడ్డారు. అధికార బలంతో పోలీసు చెంప చెళ్లుమనిపించారు. పూనెలోని సాసూన్ ఆస్పత్రిలో జరిగిన ఓ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హాజరయ్యారు. ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు విచ్చేశారు. వేదిక నుంచి కిందకు దిగుతున్న బీజేపీ ఎమ్మెల్యే సునీల్ కాంబ్లే పట్టు కోల్పోయి కింద పడబోయారు. దీంతో పక్కనే విధులు నిర్వర్తిస్తున్న పోలీసు చెంపపై కొట్టారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. సునీల్ కాంబ్లే పూనె కంటోన్మెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యే తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. కార్యక్రమానికి ఆహ్వానించే పత్రికలో తన పేరు లేకపోవడమే ఆగ్రహానికి కారణమని, అందువల్లే సహనం కోల్పోయి ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.

26 మంది బాలికల గల్లంతు

- భోపాల్‌లో అక్రమ వసతిగృహంలో ఘటన
- హక్కుల కమిషన్ చైర్మన్ తనిఖీల్లో వెల్లడైన బాగోతం

భోపాల్: బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో దిగ్భ్రాంతి గొలిపే ఘటన చోటుచేసుకుంది. భోపాల్‌లో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న వసతిగృహం నుంచి 26 మంది బాలికలు అదృశ్యమయ్యారు. భోపాల్ శివారు ప్రాంతంలో అంచల్ బాలికల హాస్టల్ నిర్వహిస్తున్నారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) చైర్మన్ ప్రియాంక్ కనుంగో ఈ పిల్లల వసతిగృహాన్ని ఆకస్మికంగా సందర్శించడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. ప్రియాంక్ కనుంగో రిజిస్టర్ తనిఖీ చేయగా... అందులో 68 మంది బాలికల ఉండాలి. కానీ 26 మంది గల్లంతైనట్లు గుర్తించారు. గల్లంతైన వారు గుజరాత్, జార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోని సెహోర్, రైసెన్, చింద్వారా, బాలాఘాట్ ప్రాంతాలకు చెందిన బాలికలుగా గుర్తించారు. అదృశ్యమైన బాలికల గురించి వసతిగృహం డైరెక్టర్ అనిల్ మాథ్యూను ప్రశ్నించగా ఆయన పొంతన లేని సమాధానలు చెప్పాడు. అనుమానం వచ్చిన అధికారి... ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల దర్యాప్తులో బాలికల హాస్టల్‌లో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. ఈ వసతిగృహం అక్రమంగా నిర్వహిస్తున్నట్లు తేలింది. వీధుల్లో ఒంటరిగా కనిపించిన పిల్లలను ఒకచోట చేర్చి, ఎలాంటి లైసెన్స్ లేకుండా ఓ మిషనరీ(మత గురువు) ఈ షెల్టర్‌హోమ్ నడుపుతున్నట్లు కనుంగో ట్వీట్ చేశారు.

రక్షించిన పిల్లలకు రహస్యంగా క్రైస్తవ మతాన్ని ఆచరించేలా చేశారని ఆరోపించారు. హాస్టల్‌లో ఎక్కువమంది అమ్మాయిలు ఆరు నుంచి 18 సంవత్సరాల వారేనని, అందులో అధికంగా హిందువులే ఉన్నట్లు తెలిపారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా రాత్రిపూట పురుష సిబ్బంది కూడా కాపలా ఉంటున్నారని గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కమిషన్ నోటీసులు పంపింది. ఈ అదృశ్యాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత, మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సూచించారు. సమాచారం తెలుసుకున్న గవర్నర్... దీనిపై దర్యాప్తు చేయాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వ సీఎస్‌కు నోటీసులు పంపినట్లు తెలిపారు. ఇక వసతిగృహంలో మిగతా పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించారు. ఈ విషయం రాజకీయ వివాదానికి దారితీసింది. అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు చోటుచేసుకున్నాయి.

రేషన్ కుంభకోణంలో మరో టీఎంసీ నేత అరెస్ట్

ఈడీ అధికారులపై మరోసారి దాడి

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో రేషన్ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బొంగావ్ మునిసిపాలిటీ మాజీ చైర్మన్ శంకర్ అధ్యను శనివారం తెల్లవారుజామున అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో టీఎంసీ నాయకుడు ఆధ్య, అతనికి, అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తులపై ఈడీ సోదాలు నిర్వహించిన తర్వాత, బొంగావ్‌లోని సిముల్టోలాలోని అతని నివాసం నుంచి అరెస్టు చేశారు. ఈ సోదాలు శుక్రవారం కనీసం 17 గంటలపాటు సాగాయని వారు తెలిపారు. అరెస్టు తర్వాత, అతని మద్దతుదారులు ఆధ్యను తమతో తీసుకెళ్లకుండా ఈడీ అధికారులను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. వారి వాహనాలపై రాళ్లు రువ్వారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఈడీ బృందంతో పాటు ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఆ గుంపుపై లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వారు తెలిపారు. సోదాలతో పాటు ఆధ్యను కూడా ప్రశ్నిస్తున్నారు. అతని సమాధానాలు సంతృప్తికరంగా లేనందున అతన్ని అరెస్టు చేశారు' అని ఈడీ అధికారి ఆరోపించారు. 'ఆధ్య అరెస్ట్ తర్వాత అతని మద్దతుదారులు మహిళల నేతృత్వంలో అధికారులు టీఎంసీ నాయకుడిని తమ వెంట తీసుకెళ్లకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అతనితో పాటు ఉన్న సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పరిస్థితిని అదుపులోకి తెచ్చారు' అని వివరించారు. పొరుగున ఉన్న దక్షిణ 24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీలో శుక్రవారం జరిగిన దాడి తర్వాత ఈడీపై ఇది రెండవ దాడి. టీఎంసీ నాయకుడు షాజహాన్ షేక్ నివాసంలో జరిగిన దాడిలో ఒక గుంపు వారి వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో తమ ముగ్గురు అధికారులకు 'తీవ్రమైన' గాయాలయ్యాయని ఈడీ తెలిపింది. ఆ గుంపు వారి వ్యక్తిగత వస్తువులైన మొబైల్ ఫోన్లు, పర్సులు కూడా లాక్కుంది. గత ఏడాది ఆరోపించిన రేషన్ కుంభకోణానికి సంబంధించి అరెస్టయిన రాష్ట్ర మంత్రి జ్యోతిప్రియో మల్లిక్‌కు ఆధ్య సన్నిహితుడిగా పరిగణిస్తున్నారు.

టీఎంసీ నాయకుడికి చెందిన ఆస్తులతో పాటు అతని అత్తమామలు, అతని సహచరుల నివాసాలు, వారికి సంబంధించిన ఐస్ క్రీం ఫ్యాక్టరీలో ఈడీ సోదాలు నిర్వహించింది. పత్రాలతో పాటు ఈడీ అతని అత్తమామల నివాసం నుంచి దాదాపు రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. తన అరెస్ట్ తర్వాత అధ్య విలేకరులతో మాట్లాడుతూ 'నేను ఈడీకి సహకరిస్తాను. సాధ్యమైన అన్ని విధాలుగా వారికి సహాయం చేస్తాను' అని తెలిపాడు. అతనిని తెల్లవారుజామున సాల్ట్ లేక్‌లోని ఈడీ కార్యాలయానికి తీసుకువచ్చారు. తర్వాత కోల్‌కతాలోని కోర్టులో హాజరుపరచనున్నారు.

కాంగ్రెస్‌తో చర్చలు విఫలమైతే బెంగాల్‌లో ఒంటరిగా పోటీ : టీఎంసీ

కోల్‌కతా : లోక్‌సభ ఎన్నికల కోసం పశ్చిమ బెంగాల్‌లో సీట్ల పంపకం విషయంలో కాంగ్రెస్‌కు 'విశాల హృదయం' ఉందని, అయితే చర్చలు విఫలమైతే ఒంటరిగా వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తృణముల్ కాంగ్రెస్ శనివారం తెలిపింది. లోక్‌సభలో టీఎంసీ నాయకుడు సుదీప్ బందోపాధ్యాయ పీటీఐతో మాట్లాడుతూ సీట్లు పంచుకోవడంపై స్థానిక కాంగ్రెస్ నేతలు ఏం ఆలోచిస్తున్నారన్నది ముఖ్యం కాదని, తుది నిర్ణయం రెండు పార్టీల అగ్ర నేతలే తీసుకుంటారని తెలిపారు. 'కాంగ్రెస్‌కు 'విశాల హృదయం' ఉందని మా అధినేత్రి మమతా బెనర్జీ ఇదివరకే చెప్పారు. ఇప్పుడు ఏం చేస్తారో వారి ఇష్టం. పశ్చిమ బెంగాల్‌లో ఉండాలా వద్దా అనేది సోనియా గాంధీ, మమతా బెనర్జీ నిర్ణయిస్తారు. కాంగ్రెస్ స్థానిక నాయకులు ఏమనుకుంటున్నారో అనేది ముఖ్యం కాదు' అని ఆయన తెలిపారు. టీఎంసీ నుంచి తమ పార్టీ సీట్లు అడుక్కోదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి చెప్పిన రెండు రోజుల తర్వాత ఈ వ్యాఖ్య వచ్చింది. ఈ అంశంపై మాట్లాడే అధికారం తనకు లేనందున పేరు చెప్పడానికి నిరాకరించిన మరో సీనియర్ టీఎంసీ నాయకుడు, పశ్చిమ బెంగాల్‌లో తమ పార్టీ పొత్తుకు సిద్ధంగా ఉందని, అయితే అవసరమైతే ఒంటరిగా వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉందని అన్నారు. రాష్ట్రంలోని 42 లోక్‌సభ స్థానాల్లో నాలుగింటిని కాంగ్రెస్‌కు వదిలివేయాలని టీఎంసీ పరిశీలిస్తోందని, అనేక మంది నేతలు రహస్యంగా చర్చలు జరిపినట్లు ధ్రువీకరించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో టీఎంసీ 22, కాంగ్రెస్ రెండు, బీజేపీ 18 సీట్లు గెలుచుకున్నాయి. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు కూడా అయిన చౌదరి ముర్షిదాబాద్ జిల్లాలోని బహరంపూర్ సీటును గెలుచుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తుపై టీఎంసీ అధినేత్రి గతంలో విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ఈ 'ప్రతిపాదన'ను ఆమె బద్ధ ప్రత్యర్థి సీపీఎం వెంటనే తోసిపుచ్చింది. దీనిపై కొంతమంది కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. టీఎంసీ అంతకుముందు 2001 అసెంబ్లీ ఎన్నికలు, 2009 లోక్‌సభ ఎన్నికలు, 2011 అసెంబ్లీ ఎన్నికల కోసం కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది.

కనీస బ్యాలెన్స్‌పై మార్గదర్శకాలు ఇవే

బ్యాంకులకు ఆర్‌బీఐ ఆదేశం

న్యూఢిల్లీ: గడిచిన రెండేళ్లలో ఎలాంటి లావాదేవీలు జరపని ఖాతాల విషయంలో మినిమమ్ బ్యాలెన్స్ లేదన్న కారణంతో ఛార్జీలు విధించొద్దని బ్యాంకులకు ఆర్‌బీఐ స్పష్టంచేసింది. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నగదు బదిలీ కోసం తెరిచిన ఖాతాలు రెండేళ్లకు మించి వాడుకలో లేనప్పటికీ... వాటిని నిరుపయోగంగా లేని ఖాతాలుగా గుర్తించకూడదని సూచించింది. బ్యాంకు ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌కు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఈ మేరకు బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు తగ్గించడంలో భాగంగా ఇటీవల ఆర్‌బీఐ ఈ సర్క్యులర్ జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీనికి సంబంధించి ఆర్‌బీఐ కొత్త నిబంధనలు జారీ చేసింది. వాడుకలో లేని ఖాతాలు నిరుపయోగంగా మారుతున్నాయన్న విషయాన్ని బ్యాంకులు ఎస్ఎంఎస్, లెటర్ లేదా ఇ-మెయిల్ రూపంలో ఖాతాదారులకు తెలియజేయాలి. ఒకవేళ ఖాతాదారులు అందుబాటులో లేనిపక్షంలో నామినీకి ఆ సమాచారం చేరవేయాలి. ఆర్‌బీఐ తాజా నివేదిక ప్రకారం బ్యాంకుల్లో ఎవరూ క్లెయిమ్ చేయని డిపాజిట్లు పెరుగుతున్నాయి. 2023 మార్చి నాటికి ఈ తరహా డిపాజిట్లు రూ.42,272 కోట్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.32,934 కోట్లుగా ఉంది. అంటే 28 శాతం మేర అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు పెరిగాయి. క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న ఈ తరహా డిపాజిట్లను వారసులు లేదా హక్కుదార్లు గుర్తించేందుకు వీలుగా 'ఉద్గాం' పేరిట ఓ కేంద్రీకృత వెబ్ పోర్టల్‌ను ఆర్‌బీఐ అందుబాటులోకి తెచ్చింది. ఒకవేళ పదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం పాటు ఏదైనా ఖాతాలో డిపాజిట్ అన్‌క్లెయిమ్డ్‌గా ఉంటేనే దానిని 'డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్' ఫండ్ పథకానికి బదిలీ చేయాల్సి ఉంటుంది.

700 దాటిన కరోనా కేసులు

మరో ఇద్దరి మృతి

న్యూఢిల్లీ: గడచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 774 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతోపాటు మరో ఇద్దరు కోవిడ్ బారిన పడి మరణించారు. మృతుల్లో గుజరాత్, తమిళనాడులో ఒక్కొక్కటి చొప్పున నమోదయ్యాయి. ప్రస్తుతం కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య 4,187కు చేరుకుంది. వీటిలో కొత్త వేరియంట్ జేఎన్.1 కారణంగా నమోదైన కేసులు 600కుపైగా ఉండటం ప్రజల్లో భయాందోళన రేకెత్తిస్తోంది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ శనివారం వివరాలు ప్రకటించింది. అధికారిక వర్గాల ప్రకారం డిసెంబర్ 5 నుంచి ఒకే రోజులో అత్యధిక సంఖ్యలో కోవిడ్ కేసులు డిసెంబర్ 31, 2023న 841 నమోదయ్యాయి. ఇది మే 2021లో నమోదైన అత్యధిక కేసుల్లో 0.2 శాతం. మరోవైపు కరోనా చికిత్స పొందుతున్న మొత్తం 4,187 మందిలో 92 శాతం మంది ఇంట్లోనే ఉండి చికిత్స పొందుతున్నారు. 2020 ప్రారంభం నుంచి నాలుగు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా 4.5 కోట్ల మందికి పైగా ప్రజలు కరోనా బారిన పడ్డారు. దీని కారణంగా 5.3 లక్షల మందికిపైగా మరణించారు. ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ ప్రకారం ఇప్పటివరకు కరోనా నుంచి కోలుకున్న వారి సంఖ్య 4.4 కోట్లకుపైగా ఉంది. ఈ ఇన్‌ఫెక్షన్ నుంచి జాతీయ రికవరీ రేటు 98.81 శాతం ఉండగా...దేశంలో కోవిడ్ కట్టడి కోసం ఇప్పటివరకు 220.67 కోట్ల డోసులు అందించినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

బ్రిజ్ భూషణ్‌పై అభియోగాలు మోపండి

కోర్టును కోరిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై అభియోగాలు మోపాలని ఢిల్లీ పోలీసులు శనివారం ఇక్కడి కోర్టును కోరారు. సింగ్‌పై అభియోగాలు మోపడంపై వాదనలు ముగించినందున, ఆరోపించిన సంఘటనలు కొన్ని విదేశాల్లో జరిగినందున, అవి ఢిల్లీలోని కోర్టుల పరిధిలోకి రావని నిందితుల వాదనను పోలీసులు వ్యతిరేకించారు. ఢిల్లీతో సహా విదేశాలలో, భారతదేశంలో సింగ్ చేసిన లైంగిక వేధింపుల సంఘటనలు ఒకే నేరంలో భాగమని పోలీసులు అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ప్రియాంక రాజ్‌పుత్ ముందు వాదనలు సమర్పించారు. 'ఈ కేసును విచారించే అధికారం ఢిల్లీ కోర్టుకు ఉంది' అని పోలీసులు న్యాయమూర్తికి చెప్పారు. దీనిపై జనవరి 20న కోర్టు తదుపరి విచారణ చేపట్టనుంది. ఆరుసార్లు ఎంపీగా ఎన్నికయిన సింగ్‌పై 2023 జూన్ 15న భారతీయ నేర శిక్షాస్మృతికి చెందిన సెక్షన్ 354 (మహిళపై దాడి లేదా నేరపూరిత బలవంతం), 354-ఎ (లైంగిక వేధింపులు), 354-డి (వెంబడించడం), 506 (నేర బెదిరింపు) కింద నగర పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

నాగిడి ఆశయాలు స్ఫూర్తిదాయకం

- లోసరి బ్రిడ్జికి సాంబమూర్తి పేరు పెట్టాలి
- వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న శక్తులపై పోరాడాలి
- విగ్రహావిష్కరణ సభలో నారాయణ

విశాలాంధ్ర-భీమవరం: వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్న శక్తులపై భూ పోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి ఉద్యమస్ఫూర్తితో పోరాడాలని, ఆయన ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ పిలుపునిచ్చారు. తీరప్రాంత భూపోరాట యోధుడు నాగిడి సాంబమూర్తి కాంస్య విగ్రహావిష్కరణ శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం నాగిడిపాలెంలో జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షతన జరిగిన సభలో నారాయణ మాట్లాడుతూ తాను విద్యార్థి ఉద్యమాల్లో ఉన్న రోజుల్లో భూపోరాట యోధునిగా నాగిడి సాంబమూర్తి పరిచయమని గుర్తుచేశారు. ఆయన విగ్రహావిష్కరణ తన చేతుల మీదుగా జరగడం ఆనందంగా ఉందన్నారు. భూమి కోసం...భుక్తి కోసం...తాడిత పీడిత ప్రజల అభ్యున్నతి కోసం జీవితాన్ని త్యాగం చేసిన సాంబమూర్తి వంటి ఆదర్శ నాయకుల కృషి ఫలితంగా ఈ తీరప్రాంతంలో పేదల స్థితిగతుల్లో మార్పురావడం సంతోషంగా ఉందన్నారు. భూ పోరాటాలు ఎందుకు చేస్తున్నారని నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేసేవారని, భూపోరాటాల ద్వారానే పేదల బతుకుల్లో కమ్యూనిస్టు పార్టీ వెలుగునింపిందని, భూ సంస్కరణ చట్టాలు తెచ్చామని నారాయణ గుర్తు చేశారు. రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, మనమందరం రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని నారాయణ సూచించారు. రాజకీయ వ్యవస్థ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని, రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లను సంఘటితంగా ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. పార్లమెంటులో పొగబాంబు దాడులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ లౌకిక వ్యవస్థకు తూట్లు పొడిచి అయోధ్యలో పూజలకు వెళ్లడం దౌర్భాగ్యమని నారాయణ నిప్పులు చెరిగారు. 2024లో ప్రమాదక పరిస్థితులున్నాయని, వాటిని ఓటు ద్వారా ఎదుర్కోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శాసనమండలి చైర్మన్ కొయ్య మోషేన్ రాజు మాట్లాడుతూ నాగిడి సాంబమూర్తి విగ్రహావిష్కరణలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆయన తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించారని, కాళీపట్నం జమీందారి భూముల పంపిణీలోను, సీఏడీ భూముల పంపిణీలోను, డీ ఫారెస్ట్ భూపోరాటాల్లో ఆరితేరిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. తన భార్యతో కలిసి ఎన్నో ఉద్యమాలు నిర్వహించారని చెప్పారు. పేదవాడి గొంతు కమ్యూనిస్టుదని, తన రాజకీయ అరంగేట్రంలో నాటి కమ్యూనిస్టు మిత్రులే తనను కౌన్సలర్‌గా గెలిపించారని, పేదల ఆలోచనలు నెరవేరాలంటే కమ్యూనిస్టులు ఉండాలని మోషేన్ రాజు అన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ సాంబమూర్తి ఒక యోధుడని, తమకు ఆత్మ బంధువని, తన తండ్రి వంక సత్యం సాగించిన అన్ని ఉద్యమాల్లో సాంబమూర్తి పాల్గొన్నారని, ప్రజల కోసం తన జీవితాన్ని ధారపోసిన త్యాగజీవని కొనియారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని రవీంద్ర అన్నారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన పోరాట పటిమ స్ఫూర్తిదాయకమని, చాలాకాలం ఆయనతో కలిసి పని చేసిన విషయాలను గుర్తు చేసుకున్నారు. గౌరవం అనేది ఆయన వద్ద నుండే నేర్చుకున్నానని, ఆయనది గొప్ప వ్యక్తిత్వమని ఎమ్మెల్యే కొనియాడారు. తాను అభిమానించే కమ్యూనిస్టుల్లో సాంబమూర్తి ఒకరన్నారు. లోసరి బ్రిడ్జికి నాగిడి సాంబమూర్తి పేరు పెట్టమని నారాయణ సూచించడం ఆనందంగా ఉందని, తమకు ఇప్పటి వరకు ఈ ఆలోచన రాలేదని, ముఖ్యమంత్రి ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తామని సభాముఖంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే గొప్ప రాజకీయ వ్యవస్థ ఉండాలన్నారు. సంకు అప్పారావు, వంక సత్యం, కపర్ధి, నాగిడి సాంబమూర్తి వంటి పోరాట యోధులు తమ రక్తాన్ని చిందించి... ఎర్ర జెండా మనకిచ్చారని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు మీసారపు లాల్, తిరుమాని కామేశ్వరరావు, తిరుమాని చంటి రాజు, సుందరరావు, ఖాన్ భాషా, ఎం.సీతారాంప్రసాద్ ఆలపించిన విప్లవ గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, నాయకులు నెక్కంటి సుబ్బారావు, దారిదీపం సంపాదకులు డీవీఎస్ వర్మ, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, సీపీఎం నాయకులు జేఎన్వీ గోపాలన్, అగ్నివన్నె క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బందన పూర్ణచంద్రరావు, సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, సర్పంచ్ నాగిడి దుర్గాభవానీ నారాయణస్వామి, ఎంపీటీసీ నాగిడి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే

అంగన్‌వాడీల సమ్మెకు దుర్గాభవానీ సంఘీభావం

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నా చౌక్ వద్ద 26వ రోజు శనివారం జరిగిన అంగన్‌వాడీల నిరసన దీక్షకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు మంచి మెనూ ఇవ్వాలని కోరటంలో తప్పేముందన్నారు. ప్రభుత్వం రెచ్చగొట్టే విధంగా ప్రయత్నిస్తుందని విమర్శించారు. సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీలను నడిపించే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం ఆలోచించి డిమాండ్‌లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తదితరులు నిరసన దీక్షలో కూర్చున్నారు. సంఘీభావం తెలిపిన వారిలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి బంకా ఝాన్సీలక్ష్మీబాయి, విజయవాడ నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, వర్కింగ్ సెక్రటరీ సీతారావమ్మ, నాయకులు చింతాడ పార్వతి, మూలి ఇందిర, భాగ్యలక్ష్మి, నాగూర్‌బీ, శాంత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుషీద, న్యాయవాదులు సుంకర రాజేంద్రప్రసాద్, సంపర శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. కాగా, అంగన్‌వాడీల సమ్మెను నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.2 కాపీలను అంగన్‌వాడీలు ధర్నా చౌక్ వద్ద దహనం చేసి నిరసన తెలిపారు.

జీఓ 2పై కార్మిక సంఘాల ఆగ్రహం

అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడాన్ని కార్మిక సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు స్థానిక గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రమేష్, సీఐటీయూ నాయకులు సీహెచ్.నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు కె.పొలారి, టీఎన్‌టీయూసీ నాయకులు ఆదిబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీలు అత్యవసర సర్వీసు అని భావించినప్పుడు 25 రోజుల నుంచి సమ్మెను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఎస్మా జీవోను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

మనిషి మనుగడకు చరిత్ర మూలాధారం

- సాంఘిక శాస్త్రాలను సామాజిక బాధ్యతతో కాపాడాలి
- ఏపీ చరిత్ర సంఘం 46వ వార్షికోత్సవ సభలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మానవ మనుగడకు మూలాధారమైన చరిత్రను సామాజిక బాధ్యతతో కాపాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ చరిత్ర మహాసభ 46వ వార్షికోత్సవ సభ శనివారం స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఆవరణలో కాలేజి గోల్డెన్ జూబ్లీతో పాటే జరిగింది. సాంఘిక శాస్త్ర విభాగానికి చెందిన సీహెచ్ గీతా కృష్ణ, పి.ఆది లక్ష్మీదేవి అధ్వర్యంలో జ్యోతి ప్రజల్వనతో బీఏ విద్యార్థులు ప్రార్థన గీతాలాపనతో సభ ప్రారంభమైంది. ఆచార్య మాజేటి సోమ శేఖర్ రావుకు 'ప్రెసిడెంట్‌షిప్'ను ప్రొఫెసర్ డి. కిరణ్ కాంత్ చౌదరి అప్పగించారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధు కుమార్ సభకు స్వాగతం పలికారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. దారిద్య రేఖకు దిగువనున్న విద్యార్థులకు విద్య అందిస్తున్న కళాశాలగా లంకపల్లి బుల్లయ్య కళాశాల అందరి మన్ననలు పొందినట్లు చెప్పారు. చరిత్రను కాపాడుకోవాలనే సామాజిక బాధ్యతతో ఆర్ట్స్ గ్రూపులను అందిస్తున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చరిత్ర సంఘం వ్యవస్థాపకుల్లో ముఖ్యులైన ఆచార్య వకాల భరణం రామకృష్ణ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాల్ని రాబోయే తరాలకు అందించాలంటే చరిత్రపై ఆసక్తిని బతికించాలన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ వేదికగా ఏర్పాటైన ఈ సంఘం తొలిసారిగా విశాఖలో వేడుకలను జరుపుకోవడంతో తన కల నెరవేరిందన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల సావనీర్‌ను ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సమత విడుదల చేశారు. మాజీ డీజీపీ ఆంజనేయ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ హిస్టరీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులు క్రమంగా తగ్గిపోతున్నారని, ఏ విభాగాన్ని మూసివేయవద్దని ఆంధ్రా యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీకి విజ్ఞప్తి చేశారు. కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ 45వ వార్షిక కార్యక్రమాల సంపుటిని విడుదల చేశారు. కార్యదర్శి నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి ప్రవేశపెట్టారు. ఆచార్యులు కెసిరెడ్డి, తిమ్మారెడ్డి, ధారపాటి ఉమామహేశ్వరరావు, ప్రసన్నకుమార్, శరత్ కుమార్ ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంఘం ఆవశ్యకత, పురోగతిపై ప్రసంగించారు. మధ్యాహ్న భోజన విరామం తర్వాత వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చలు సాగాయి. ఆచార్య ఎస్ మురళి మోహన్ (ప్రాచీన ఆంధ్రులు) డాక్టర్ జె కృష్ణ ప్రసాద్ బాబు (మధ్యయుగ ఆంధ్రులు,) ఆచార్య మల్లి గాంధీ (ఆధునిక ఆంధ్ర) ఆచార్య అజారుద్దీన్ (హిస్టరీగ్రఫీ), డాక్టర్ ఏఎల్ రూపవాణి (లోకల్ హిస్టరీ) బోధించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి ఎస్‌కే చక్రవర్తి, ఆర్ట్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్వీహెచ్ శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ జె లక్ష్మణ్ బాబు, సోషల్ సైన్స్ విభాగాధిపతి పీఎం శరత్ కుమార్ వివిధ అంశాలపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 50 మంది ప్రతినిధులు, 100 మంది పరిశోధనా పండితులు, 70 మంది ఉపాధ్యాయ సమితి సభ్యులు, 150 మంది విద్యార్థులు, 60 మంది కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు భాష వికాసానికి కృషి చెయ్యాలి

- మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు
- గైట్లో అంబరాన్నంటిన తెలుగు వైభవం

విశాలాంధ్ర-రాజానగరం: తెలుగు భాష వికాసానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు అన్నారు. శ్రీశ్రీ రాజరాజ నరేంద్రుల పట్టాభిషేక సహస్రబ్ది నీరాజనంగా, నన్నయ భారతాంధ్రీకరణకు వెయ్యేళ్లు సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త అధ్వర్యంలో రెండో రోజు శనివారం 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలను ముఖ్య అతిథి గవర్నర్ హరిబాబు, గౌరవ అతిథి, పద్మభూషణ్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ తెలుగు భాష ప్రకృతి సంపద వంటిదని, అటువంటి సంపద గొంతు నులిమివేయకుండా సజీవంగా ఉంచాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. శ్రీకాకుళం నుంచి శ్రీకాళహస్తి వరకు బహుళ నదులు ప్రవహిస్తున్నాయని, జల సంపద ఉన్న ప్రాంతం తెలుగు ప్రాంతమని, అందుకే నదులకు స్త్రీ మూర్తులు పేర్లు పెట్టారని వివరించారు. ఈ ప్రాంతవాసుల కోసం సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. మన దేశంలో దాదాపు 14 వందల భాషలు ఉన్నాయని, అందులో 230 భాషలు ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజన తెగలకు సంబంధించినవని చెప్పారు. సుందరమైన భాష తెలుగు అని తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి వ్యాఖ్యానిస్తే, దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు అన్నారని, ఇక ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్ అనే నానుడి తెలుగు భాషకు ఉందని గుర్తు చేశారు. అవధాన ప్రక్రియ మహత్తర తెలుగు భాష సొంతమని, కవితలు, కథలు, గేయాలు, హరికథలు, బుర్రకథలు, గజల్స్ వంటి ఎన్నో ప్రక్రియలు తెలుగు భాషలో ఉన్నాయన్నారు. అన్నమయ్య, శ్రీ రామదాసు, త్యాగయ్య వంటి కవులు తమ రచనలతో తెలుగు భాషకు వన్నె తెచ్చారని కొనియాడారు. ప్రస్తుతం కొన్ని పరిస్థితులను చూస్తే తెలుగు బలహీనపడుతోందన్న భయం, మన పిల్లలు తెలుగు నేర్చుకోవడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతున్నాయని తెలిపారు. తెలుగుపై అభిమానం పెంచుకుని అందరూ తెలుగు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. సున్నితమైన తెలుగు భాష ద్వారా గజల్స్ రూపంలో శ్రీనివాస్ సామాన్య ప్రజల్లోకి ఒక పక్క తీసుకువెళుతూనే, మరో పక్క తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమానికి చేస్తున్న సేవలను ప్రశంసించారు. అంతర్జాతీయ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్న డాక్టర్ గజల్ శ్రీనివాస్, డాక్టర్ చైతన్య రాజును అభినందించారు. డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ అవధాని ప్రక్రియ తెలుగువారి స్వంతం అని చెప్పారు. మన సాహిత్యం, భాషా ఔనత్యాన్ని హిందీ భాషలోకి తర్జుమా చేసి ఎగుమతులు చేయాలని, తద్వారా ప్రపంచ దేశాలకు తెలుగు ఘనత సునాయాసంగా వ్యాపిస్తుందని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాలు విడిపోలేదని, రెండు రాష్ట్రాలుగా విస్తరించాయని చెప్పారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలు ఐదు ఉండగా, వాటి సరసన తెలుగు రాష్ట్రాలు రెండుగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న శాంతా వసంత ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు అధికార భాషగా కాకుండా, మమకార భాషగా ఉండాలన్నారు. భాషను మనం కాపాడటం కాదని, భాషే మనల్ని ఉద్ధరిస్తుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని తెలిపారు. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ కె.వి.వి.చైతన్య రాజు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో తెలుగు పద్యపఠనం తీసుకురావాలని, తద్వారా తెలుగు భాషను బతికించాలనే సంకల్పంతో తెలుగు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాదరావు, జి.హరికృష్ణ రాధికా దంపతులు, నమస్తే తెలంగాణకు చెందిన కె.ఎల్.రాజమ్ దంపతులు, గుంటుపల్లి అశ్వర్ధ రామారావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు తదితరులను గవర్నర్ చేతుల మీదుగా దుశ్శాలువా కప్పి జ్ఞాపికలు అందించి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో గుజరాత్ హైకోర్టు న్యాయూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రరాయ్ దంపతులు, మాజీ మంత్రి పి.వి.రాఘవులు, మాజీ ఎమ్మెల్సీ కె.రవి వర్మ, గైట్ కళాశాల ఉపాధ్యక్షులు శశి వర్మ, గన్ను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అధినేత జి.హరికృష్ణ, రాధిక దంపతులు, రాపిడో ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ గుంటుపల్లి అశ్వర్థ రామారావు, భాష్యం విద్యా సంస్థల వ్యవస్థాపకులు భాష్యం రామకృష్ణ, కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం చైర్మన్ ఎ.మోహన్ రెడ్డి, అనందా గ్రూప్ చైర్మన్ ఉద్దరాజు కాశీవిశ్వనాథ రాజు, ఏపీ అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కత్తి వెంకటేశ్వర్లు, జనతా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మిథున్ చౌదరి, శ్రీ వెంకటేశ్వర ఫైనాన్స్ ఎండీ రావిపాటి మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన అవసరం

వీవీ కృష్ణారావు ఆత్మీయ కలయికలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచుకోవాలని వక్తలు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా సమతా పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు అధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో శనివారం జరిగిన ఆత్మీయ కలయికలో వారు పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నేతలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు పాల్గొని దేశంలో రాజకీయ పరిస్థితులు, ఓటు హక్కు అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. సభకు అధ్యక్షత వహించిన కృష్ణారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పుడు దేశంలో కనీస విద్యార్హత గల వారు 5శాతం మాత్రమే ఉండేవారని తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశంలో మొదటి సార్వత్రిక ఎన్నికల్లోనే వయోజనులైన స్త్రీ, పురుషులకు ఓటు హక్కు కల్పించటంతో విద్యార్హత తక్కువగా ఉన్న దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా? అని ప్రపంచ దేశాలు సందేహించాయని చెప్పారు. మన దేశంలో ఓటు విలువ ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధంగా ఉంటుందన్నారు. ఎన్నికల్లో దామాషా పద్ధతిలో ఓటింగ్ జరిగితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అలా జరిగితే వామపక్షాలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. ఎందుకు ఓటు వేయాలి? ఎవరికి ఓటు వేయాలి? అనే సర్వేలు చేస్తున్నారు తప్ప... ఎందుకు ఓటు వేయటం లేదనే అంశంపై సర్వేలు చేయటం లేదన్నారు. నోటాలో 25శాతం ఓట్లు పోలైతే ఆ ఎన్నికను రద్దు చేయాలనే ఉద్యమం చేయడానికి వీలు కల్గుతుందన్నారు. వామపక్ష విద్యార్థి సంఘాలకు చాలా ప్రాచుర్యం ఉందని, అయితే వారు ఎన్నికల్లో పోటీ చేసే విధానం లేదన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మనతో పాటు స్వాతంత్ర్యం పొందిన దేశాలు నియంతృత్వంలోకి వెళ్లాయని, మనం మాత్రం ప్రజాస్వామ్యంలోనే ఉన్నామని చెప్పారు. రాష్ట్ర రాజకీయాల గురించి మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో ఓట్లు చేర్పింపు, తొలగింపు అంశాలపై దృష్టి ఉండేది కాదన్నారు. నేడు నా ఓటు ఉందా? లేదా? అనే అనుమానం ఏర్పడిందని, దీంతో ప్రజాస్వామ్యం ఉందా అనే ప్రశ్నతలెత్తుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తారని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేసులకు భయపడి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కేంద్రానికి తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఎన్టీ రామారావు పదవీచ్యుతుడ్ని చేసినా పోరాడి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తు చేశారు. బహిరంగ సభల్లో నాయకుల పెళ్లిళ్ల అంశం ప్రస్తావనకు వస్తోందని, దీనికి కౌంటర్‌గా సోషల్ మీడియాలో అనేక పోస్టులు చక్కర్లు కొడుతున్నాయని చెప్పారు. ఇంట్లో ఉండే మహిళలను కించపర్చే విధంగా పోస్టులు పెట్టటం మంచిపద్ధతి కాదన్నారు. ప్రజాతంత్ర శక్తులు, లౌకికవాదులు, మేధావులు దేశాన్ని కాపాడటానికి ముందుకు రావాలని కోరారు. యువ న్యాయవాది యశ్వని రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో ఓట్ల తొలగింపు ఎలా జరిగిందనే విషయాలు వివరించారు. శాసనమండలి సభ్యులు వీటీ నాయుడు, న్యాయవాది ఎస్ఎస్‌సీ బోస్, విశ్రాంత ఐఏఎస్ బలరామయ్య, విశ్రాంత ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు, రైతుసంఘం నాయకులు అక్కినేని భవానీ ప్రసాద్, పాత్రికేయులు డానీ, ప్రజాఉద్యమనేత జమున, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, నాయకులు జాస్తి కిషోర్, నరహరిశెట్టి నరసింహారావు, నగర ప్రముఖులు నల్లమోతు చక్రవర్తి, పిచ్చుక శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు. అక్కినేని భవానీ ప్రసాద్ రాసిన 'ఓటు ఫర్ బెటర్ నేషన్' పుస్తకాన్ని మండలి బుద్ధప్రసాద్, ఏబీ వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని యువ న్యాయవాది రవితేజ పర్యవేక్షించారు. సంక్రాంతి సందర్భంగా అతిథులకు పిండి వంటలు, తేనీరుతో ఆతిథ్యం లభించింది. దూ దూ బసవన్నలతో ఆడిటోరియం ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల

శతజయంతి ఉత్సవాలలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం: ఉద్యమకారునిగా నిబద్ధతతో జీవితాన్ని గడిపిన బహుముఖ ప్రజ్ఞాశాలి పడాల రామారావు అని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్, ఏపీ విశ్రాంత న్యాయమూర్తి ఆశపు రామలింగేశ్వరరావు అన్నారు.స్థానిక శ్రీ వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ ఆంధ్రప్రదేశ్, అభ్యుదయ రచయితల సంఘం తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్వర్యంలో శనివారం జరిగిన పడాల రామారావు శత జయంతి ఉత్సవాల సభలో ఆశపు రామలింగేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఉద్యమకారుడిగా అరెస్టయి కడలూరు జైలులో ఉన్నా రచనా వ్యాసాంగం వదలలేదని ఆయన తెలిపారు. సమకాలీన పరిస్థితులలో ఆలోచన కలిగిన వ్యక్తులుగా జీవించాలంటే పడాల వంటి వారి గురించి కచ్చితంగా అధ్యయనం చేయాలన్నారు. పడాల రామారావు సామాన్యుల జీవితాన్ని, బాధలను, ఆవేదనలను శోధించి పాఠకులకు అందించారని ఆశపు రామలింగేశ్వరరావు అన్నారు. సభకు కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సభ్యుడు మందలపర్తి కిషోర్ మాట్లాడుతూ శతాధిక గ్రంథకర్త పడాల రామారావు కఠినమైన సాహిత్యాన్ని సరళీకరించి పాఠకులలో పఠనాసక్తి పెంచారని కొనియాడారు. పడాల రాసిన శివకన్య నవల నేటితరం పఠించవలసిన అవసరం ఉందన్నారు. అరసం తూర్పుగోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ సమాజానికి అంకితమైన వారిలో పడాల రామారావు ప్రథమ స్థానంలో ఉంటారని, ఆరవ తరగతి వరకు చదువుకున్నా అనేక భాషలు నేర్చుకొని అనేక గ్రంథాలు రాశారని గుర్తుచేశారు. కార్మిక ఉద్యమంలో గెరిల్లాగా నడిచిన వ్యక్తి, నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి వామపక్ష భావాలతో ఉద్యమాలకు అంకితమై ఎన్నో అవకాశాలు వచ్చినా పడాల రామారావు కాలదన్నేరని డాక్టర్ రామారెడ్డి అన్నారు. రెండవ సదస్సుకు అధ్యక్షత వహించిన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ వితంతువు పునర్వివాహాలను ఉద్యమంగా చేపట్టిన వీరేశలింగం పేరున వెలసిన కళాశాలలో కేంద్ర సాహిత్య అకాడమీ అధ్వర్యంలో జైలు గదిని విశ్వవిద్యాలయంగా మలుచుకున్న పడాల రామారావు శతజయంతోత్సవాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. కార్మిక సమావేశాలలో సూటిగా మాట్లాడే నేర్పు, వాచకం ఉన్న గొప్ప వ్యక్తి పడాల రామారావు అని కార్మిక నాయకుడు జి.ఓబులేసు అన్నారు. మూడవ సదస్సుకు నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి తరపట్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పెనుమాకుల భాస్కరరావు, జి.ఓబులేసు, వాడ్రేవు సుందర్రావు, పెనుగొండ లక్ష్మీనారాయణ, తోటకూర వెంకటనారాయణ, బీహెచ్‌వీ రమాదేవి పడాల రామారావు సాహిత్యంపై పత్రాలు సమర్పించారు. రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు, అరసం జిల్లా కార్యవర్గ సభ్యుడు లోలభట్టు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. పీవీబీ సంజీవరావు సమాపన ప్రసంగం చేయగా, అరసం జిల్లా అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తొలుత స్వాగతం పలికి, చివరగా వందన సమర్పణ చేశారు. విభూతి బ్రదర్స్‌చే పడాల రామారావు చరిత్రపై బుర్రకథ ప్రదర్శన జరిగింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.